
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కర్నూలు జిల్లా వార్తలు

5

శనివారం 13 సెప్టెంబరు 2025

కార్యదర్శులకు ముగిసిన శిక్షణ

● 53 మండలాల నుంచి హాజరు



పంచాయతీ కార్యదర్శులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న డీపీవో భాస్కర్

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు సాగిన శిక్షణ శుక్రవారం ముగిసింది. 53 మండలాల నుంచి ప్రతి మండలం నుంచి ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు స్వంత ఆదాయ వనరుల అంశంపై జడ్పీ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల శిక్షణ కేంద్రంలో శిక్షణకు హాజరయ్యారు. పంచాయతీ అభివృద్ధికి స్వంత ఆదాయ వనరుల సృష్టి, స్వంత ఆదాయంలో పన్ను వనరుల, పన్ను వసూళ్లతో ఎదురయ్యే సవాళ్లపై అవగాహన కల్పించారు. శిక్షణకు హాజరైన పంచాయతీ కార్యదర్శులకు జిల్లా పంచాయతీ అధికారి పి.భాస్కర్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమం లో డీపీఆర్సీ ట్రైనింగ్ మేనేజర్ గిడ్డేష్, టీవోటీలు ఏ.జేమ్స్ కృపవరం, పి.ప్రభాకర్, అన్వర్‌బాషా, పి.జగన్నాథం, డీకే.దస్తగిరిబాషా పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాలు ఇవ్వండి

● జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి రాధిక

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి గానూ జిల్లాలో ప్రైవేటు, ఎయిడెడ్, ప్రభుత్వ డిగ్రీ, ఉన్నత కళాశాలలో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, ఈబీసీ, వికలాంగులు విద్యార్థుల పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌కు అర్హులైన వారి వివరాలివ్వాలని జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి రాధిక అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కళాశాలలో జ్ఞానభూమి, వీపీ-2 లాగిన్‌లలో విద్యార్థుల రెన్యూవల్ రిజిస్ట్రేషన్స్ 5,169, బయోమెట్రిక్ ఆధార్ నిర్ధారణ 5,995, ప్రిన్సిపాల్ ఓటీపీ ధ్రువీకరణ 2,891 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ దరఖాస్తులను సమర్పించాలని ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు సూచించారు. ఫ్రెష్ రిజిస్ట్రేషన్లు 12,945 మందికి సంబందించిన బయోమెట్రిక్ అథెంటికేషన్, ప్రిన్సిపాల్ ఓటీపీ పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియను ఈనెల 15వతేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఫ్రెష్ రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు ఎన్‌సీపీఐకు మ్యాపింగ్ చేసుకోవాలని సూచించారు.

పెరిగిన వేరుశనగ ధర

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం వేరుశనగ ధరలు పెరిగింది. గతవారంతో పోల్చితే క్వింటానికి రూ.350 పైగా ధర పెరిగింది. వేరుశనగ దిగుబడుల గ్రేడింగ్ సమస్య పరిష్కారమయ్యాక ధరలు పెరగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతులు పంట విక్రయానికి తెచ్చేటప్పుడు ఇంటి వద్దనే రాళ్లు, మట్టి లేకుండా గ్రేడింగ్ చేసుకొని వస్తే మరింత ధర లభిస్తుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. రైతులు 1,852 బస్తాల వేరుశనగ విక్రయానికి తీసుకురాగా క్వింటా ధర గరిష్ఠం రూ.7,300 మధ్యస్థం రూ.6,693, కనిష్ఠ ధర రూ.3,619 పలికింది.

ఉల్లి.. కుళ్లి..!

ఉల్లి కష్టాలు రైతులనే కాదు అధికారులను కూడా వెంటాడుతున్నాయి. టన్నుల కొద్దీ సేకరించిన ఉల్లి కుళ్లిపోతోంది. దీంతో మార్కెట్ యార్డు ప్రాంతం అంతా దుర్వాసన వెదజల్లుతోంది. యార్డు ప్రాంతంలో ఎక్కడ చూసినా ఉల్లి నిల్వలే దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వం రైతులకు రూ.1,200లు మద్దతు ధర ప్రకటించింది. మార్క్‌ఫెడ్ సంస్థ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో రైతుల నుంచి 1000 టన్నుల ఉల్లిని కొనుగోలు చేసింది. వాటిలో కేవలం 150 క్వింటాళ్లు మాత్రమే అమ్మగలిగింది. మిగిలిన ఉల్లిని బయటకు తరలించేందుకు మార్కెట్ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు.



కర్నూలు మార్కెట్ యార్డులో దిబ్బలా పేరుకుపోయిన ఉల్లి సంచులు

● భరించలేని దుర్వాసన
● మార్కెట్ యార్డులో ఎక్కడ చూసినా ఉల్లి నిల్వలు
● 850 మెట్రిక్ టన్నుల క్వింటాళ్ల అమ్మకంపై అయోమయ పరిస్థితులు
● తరలించేందుకు అధికారుల ఇబ్బందులు

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో ప్రస్తుతం పది రోజుల నుంచి రైతులు తెచ్చిన ఉల్లిని కొనేవారు లేరు. ప్లాట్‌ఫారాల్లోనే ఉల్లి నిల్వలు కుళ్లిపోతున్నాయి. ఎక్కడ పడితే అక్కడ వందలాది క్వింటాళ్ల కుళ్లిపోయిన ఉల్లి బస్తాలు దర్శనమిస్తున్నాయి. యార్డు అంతా దుర్వాసన వెదజల్లుతోంది. ఈ ఉల్లిని బయటకు తరలించేందుకు మార్కెట్ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు కుళ్లిన ఉల్లి పేరుకు పోతుండగా.. మరో వైపు రైతులు అమ్మకానికి తెచ్చిన ఉల్లి మొత్తాలో పది శాతం దాకా పాడైపోవడంతో వాటిని గుట్టలుగా పేర్చడం తప్ప మరో దారి అధికారులకు కనిపించడం లేదు.

150 టన్నులు మాత్రమే అమ్మకం

క్వింటానికి రూ.1,200లు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం మార్క్‌ఫెడ్ సంస్థ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో రైతుల నుంచి 1000 టన్నుల ఉల్లిని కొనుగోలు చేసింది. అధికారులు వాటిని యార్డులోని గోదాములు, ప్లాట్‌ఫారాల్లో నిల్వ చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఇక్కడి ఉల్లిని సరఫరా చేసే అవకాశం లేక స్థానికంగానే హోటళ్లు, విద్యాసంస్థలు, హాస్టళ్ల యజమానులతో కొనుగోలు చేయించేందుకు ఆదివారం మార్క్‌ఫెడ్ అధికారులు తలమునకలయ్యారు. చివరకు 150టన్నుల ఉల్లిని మాత్రమే అమ్మగలిగారు. మిగిలిన 850 మెట్రిక్ టన్నుల ఉల్లిని ఏమూలాలకు సరఫరా చేయాలో, ఎవరికి అమ్మాలో రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు లేవు. వారు దిక్కుతోచని స్థితిలో తలపట్టుకు కూర్చున్నారు. మరో వైపు వేలాది ఉల్లి బస్తాలు గోదాముల్లో, ప్లాట్‌ఫారాల్లో ప్రస్తుత ఎండలకు మగ్గిపోతున్నాయి. ఇప్పటికే 20శాతం ఉల్లి కుళ్లిపోయి కంపు కొడుతుందని మార్క్‌ఫెడ్ సంస్థ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు.

ముందు జాగ్రత్తలు పాటించలేదు

గత సంవత్సరం ఇదే నెలలో కర్నూలు మార్కెట్ యార్డుకు ఉల్లి పోటెత్తింది. 5వేల నుంచి 10వేల క్వింటాళ్ల దాకా ఉల్లిని రైతులు అమ్మకానికి తెచ్చారు. రోజుల తరబడి ఉల్లి ప్లాట్‌ఫారాల్లోనే నిల్వ ఉండటంతో రైతులు ఆందోళనలు చేపట్టారు. దీంతో ప్రభుత్వం దిగి వచ్చింది. మంత్రులు, కలెక్టర్లు గుంటూరు నుంచి మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు యార్డులోనే తిష్ట వేసి రైతుల నుంచి ఉల్లి కొనుగోళ్లను వెంటనే జరిపించారు. ఆ పరిస్థితి మళ్లీ పునరావృతం కాకుండా ఉండేందుకు తగిన కార్యాచరణతో ఈసారి మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉన్నా.. ఎటువంటి ముందు జాగ్రత్తలు పాటించలేదు. గత సంవత్సరం ఉల్లికి క్వింటానికి రూ.3వేల నుంచి రూ.4వేలు రైతులకు అందింది. పెద్దగా అప్పట్లో రైతుల నుంచి ధర విషయంలో నిరసన కాలేదు. అయితే ఈసారి వ్యాపారులు క్వింటం ఉల్లికి రూ.500ల నుంచి రూ.1000ల లోపే ధరను అందించడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో పడ్డారు.

ఉత్తర్వులు రాలేదని..

అధిక వర్షాల కారణంగా పండించిన పంటల్లో సగం కుళ్లిపోయే పరిస్థితి ఎదురవుతోంది. రైతుల ఆందోళనలను పురస్కరించుకుని ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేపట్టేందుకు సిద్ధమైంది. ఇప్పటిదాకా కొనుగోళ్లకు సంబంధించి మార్కెటింగ్ శాఖ జీవో కానీ నిబంధనలు జారీ చేయలేదని, నిబంధనల ఉత్తర్వులు రాలేదని కర్నూలు మార్కెట్ కమిటీ అధికారులు మార్క్‌ఫెడ్ సంస్థ అధికారులు చెబుతున్నారు. భారీఎత్తున సేకరించిన ఉల్లిని ముందస్తు ప్రణాళిక లేకుండానే ఎక్కడికి పంపాలో ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోలేదు. వందల టన్నుల ఉల్లిని ఎక్కడకు తరలించాలో ఆ మొత్తం డబ్బులు తాము భరించాల్సి వస్తుందేమోనని మార్క్‌ఫెడ్ అధికారుల గుండెల్లో దడ మొదలైంది.



ఈ ఫొటోలోని రైతు పేరు మహేశ్. కోడుమూరు మండలం వర్కూరు గ్రామం. తనకున్న రెండెకరాల్లో రూ.లక్షన్నర ఖర్చుచేసి ఉల్లి పంట సాగుచేశాడు. కర్నూలు మార్కెట్ యార్డులో నెలకొన్న పరిస్థితుల కారణంగా ఉల్లిని కొనే వారు లేరు. పొలంలోనే పక్వానికి వచ్చిన పంటను వదిలేశారు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నాడు. ఇదే రీతిలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేలాది మంది రైతులు ఈ పరిస్థితుల్లో కొట్టుమిట్లాడుతున్నారు.



సాతనూరులో అధిక వర్షానికి చెడిపోవడంతో ఉల్లి పంటకు గ్రేడింగ్ చేస్తున్న రైతులు



రైతుల నుంచి కొన్న 850 మెట్రిక్ టన్నుల ఉల్లి గోదాముల్లోనే మగ్గుతున్న దృశ్యం

నేడు, రేపు ఉల్లి వేలం: జేసీ

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ఉల్లిని అమ్మేందుకు కర్నూలు మార్కెట్ యార్డులో శని, ఆదివారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ డా.నవ్య తెలిపారు. శని, ఆదివారాలు కర్నూలు మార్కెట్ యార్డుకు సెలవు ప్రకటించామని, రైతుల నుంచి మార్కెట్‌లో కొనుగోలు చేసిన 2,800 టన్నుల ఉల్లిని బహిరంగ వేలం వేసే కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తున్నామని, ఆసక్తిగల వారు కొనుగోలు చేసేందుకు ముందుకు రావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

మార్కెట్ యార్డుకు రెండు రోజులు సెలవు

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్‌యార్డుకు శని, ఆదివారాల్లో సెలవు దినంగా ప్రకటించామని కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్‌గ్రేడ్ సెక్రెటరీ జయలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం యార్డులో ఉన్న ఉల్లి నిల్వలను బయటకు తరలించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రైతులు ఈ రెండు రోజుల్లో ఉల్లి గడ్డలు అమ్మకానికి తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ కార్పొరేషన్ నిర్వీర్యం చేసిన జగన్

మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసిందని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి పేర్కొన్నారు. కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళితులను వైసీపీ తీవ్ర అన్యాయం చేసిందన్నారు. దళితులను మోసం చేసిన వారు బాగుపడినట్లు చరిత్రలో లేదన్నారు. ఎన్‌ఎస్‌ఎఫ్‌డీసీ, ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ రుణాలు తీసుకున్న వారు రుణాలు చెల్లిస్తేనే కొత్తవారికి రుణాలు మంజూరు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. షెడ్యూల్ కులాల యువతకు కమ్యూనికేషన్స్ స్కిల్స్‌లో యువతకు శిక్షణ ఇవ్వడానికి రూ.5 కోట్లు మంజూరు చేశామన్నారు. ఇప్పటికే రూ.3కోట్లు విడుదల చేశామని, మరో రూ.2 కోట్లు పెండింగ్‌లో ఉందని తెలిపారు. కర్నూలు ఉమ్మడి జిల్లాలో షాపింగ్ కాంప్లెక్స్ మరమ్మతుల పనులను రూ.3.90 కోట్లతో చేపట్టనున్నట్లు వివరించారు. రూ.340 కోట్లతో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిధులతో అర్హులైన లబ్దిదారులకు రుణాలిచ్చేందుకు ప్రణాళికలు అప్పటికే పూర్తిచేశామన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసిదేవి, డైరెక్టర్ జేమ్స్, పోతురాజు రవికుమార్, తిరుపాలు, మాదిగ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉండవల్లి శ్రీదేవి

దళితుల సంక్షేమమే లక్ష్యం

కర్నూలు అర్బన్: దళితుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి అన్నారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ జేమ్స్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. వైసీపీ నేతలు రాష్ట్రాభివృద్ధిని చూసి జీర్ణించుకోలేక పోతున్నారని ధ్వజమెత్తారు. సమావేశంలో డీసీఎం హెచ్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, కార్పొరేటర్ పద్మలతా రెడ్డి, కేఈ సుబ్బారెడ్డి, ఏసన్న, గున్నామార్క్, తిరుపాలు, శేషగిరి, శివ, టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు బజారన్న తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టింది..!



బిల్లేకల్లు వాగును దాటుతున్న ప్రజలు



ప్రమాదకరంగా చాపవంకను దాటుతున్న ప్రజలు

● 26 మండలాల్లో భారీ వర్షం
● ఆదోనిలో అత్యధికంగా 86.8 మి.మీ. వర్షపాతం
● కోసిగిలో 10.2 మి.మీ. వర్షపాతం నమోదు
● పంటలు నీటిపాలు
● కన్నీరు మున్నీరవుతున్న రైతులు

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో వర్షం దంచికొట్టింది. శుక్రవారం జిల్లాలోని 26 మండలాల్లో భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. హంద్రీనదికి గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి 4వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. ఆదోనిలో అత్యధికంగా 86.8మి.మీ వర్షపాతం, కోసిగిలో 10.2మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు మొత్తం మీద 29.7మి.మీ వర్షపాతం వర్షం నమోదైంది. సెప్టెంబరు నెలాఖరు వరకు జిల్లాలో 48.6 మి.మీ కురవాల్సి ఉండగా.. 12వ తేదీ నాటికే రెట్టింపు 87.4మి.మీ వర్షం నమోదు కావడం విశేషం. ఈ వర్షం ధాటికి జిల్లాలోని మంత్రాలయం, నందవరం, పత్తికొండ, తుగ్గలి, కోడుమూరు, గూడూరు, ఆదోని, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, క్రిష్ణగిరి, దేవనకొండ మండలాల్లో పక్వానికి వచ్చిన ఉల్లి పంట నీటమునిగింది. రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. బసాపురం వంక వద్ద ఉపాధ్యాయులను సచివాలయ సిబ్బందిని ట్రాక్టర్లతో గ్రామాలకు తీసుకెళ్తున్నారు. హంద్రీనదికి వరద పోటెత్తింది. దాదాపు 4వేల క్యూసెక్కుల వరద నదిలో ప్రవహిస్తుంది.



దేవనకొండ : ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు హంద్రీకి వరద పోటెత్తింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాటు, హంద్రీ-నీవా నుంచి హంద్రీకి నీటి ప్రవాహం పెరిగింది. గాజులదిన్నె జలాశయానికి వరద పెరగడంతో గేట్లు ఎత్తే అవకాశం ఉంది.

హంద్రీకి పోటెత్తిన వరద

హంద్రీకి జీడీపీ నీరు విడుదల

గోనెగండ్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేని వర్షాల కారణంగా గాజులదిన్నె ప్రాజెక్టు కు వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు లో ప్రస్తుతం 3.93 టీఎంసీల వరదనీరు చేరింది. ప్రస్తుత ప్రాజెక్టు నీటి నిలువ సామర్థ్యం 4.5 టీఎంసీలు కావడంతో శుక్రవారం రాత్రి 7:10 లకు జీడీపీ ఇరిగేషన్ డీఈ సుబ్బరాయుడు, ఏఈ మహమ్మద్‌ఆలీ 4, 5, గేట్లను ఎత్తి 2000 క్యూసెక్కుల నీటిని దిగువ హంద్రీనదికి విడుదల చేశారు. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో రాత్రి వరకు ఎగువ ప్రాంతాల నుంచి 15వేల క్యూసెక్కులు కొనసాగుతోంది. నీటిమట్టాన్ని బట్టి ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు శనివారం ఉదయం మరింత నీటిని విడుదల కొనసాగే అవకాశం ఉంది. అంతకు ముందు ఇరిగేషన్ డీఈ సుబ్బరాయుడు, తహసీల్దార్ రాజేశ్వరి, సీఐ విజభాస్కర్, జీడీపీ ఏఈ మహ్మద్ ఆలీ, ఉగ్రనరసింహులు, గంగమ్మకు పూజ చేసి 4, 5 గేట్లు ఎత్తి నీటి విడుదల చేశారు.



కోతకొళం-ఉప్పరహాల్ మధ్య నిలిచిన రాకపోకలు



శిథిలావస్థలో డాకానాయిని బ్రిడ్జి

వంతెనలు శిథిలం

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లూరు-ముంబై రాష్ట్ర హైవేపై వంతెనలు అత్యంత ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదం జరిగే దుస్థితి ఉంది. అనంతపురం, తాడిప్రతి, గుత్తి, బళ్లారి ప్రాంతాల నుంచి కడప, నెల్లూరు, ప్రొద్దుటూరు ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ఈ రోడ్డు మీదే వెళ్తుంటాయి. కొలిమిగుండ్ల సమీపంలోని డాకానాయిని బ్రిడ్జితో పాటు, కల్వటాల గ్రామం వద్ద ఎర్రవాగుపై ఉన్న వంతెన అత్యంత ప్రమాదకరంగా మారాయి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే రాష్ట్ర హైవే కావడంతో పెద్ద ఎత్తున ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

● మరోవైపు భారీ వర్షాలు కురిస్తే కల్వటాల వద్ద ఎర్రవాగు వంతెనపై వరద నీరు పెద్ద ఎత్తున ఉప్పొంగి ప్రవహిస్తుంది. దీంతో భారీ వర్షాలు కురిస్తే గంటల తరబడి కొలిమిగుండ్ల మండలం నుంచి కడప జిల్లాకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ప్రభుత్వం త్వరితగతిన నూతన వంతెనలు నిర్మించి, ప్రమాదాలు అరికట్టాలని కోరుతున్నారు.

● ప్రమాదాలకు నిలయంగా మారిన వైనం



కల్వటాల గ్రామం వద్ద రక్షణ గోడలేని ఎర్రవాగు వంతెన

జిల్లా కోర్టులో ఈసేవా కేంద్రం ప్రారంభం



ఈసేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కర్నూలు జిల్లా న్యాయాధికారి కబర్డి

కర్నూలు లీగల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో ఈ సేవా కేంద్రాన్ని కర్నూలు జిల్లా న్యాయాధికారి జి.కబర్డి శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈసేవా కేంద్రంలో అన్నికోర్టులకు సంబంధించిన సమాచారాన్ని కక్షిదారులకు అందిస్తారని న్నారు. కక్షిదారులు ఈసేవా కేంద్రాల ద్వారా సుప్రీం కోర్టు, హైకోర్టులు, జిల్లా కోర్టుల తీర్పు కాపీలను పొందవచ్చు అన్నారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు హరినాథ్ చౌదరి, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు, న్యాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

పాణ్యం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్దూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థి పెదరాయుడు రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం విజయలక్ష్మీ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈనెల 10 వతేదీన కర్నూలు ఔట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన విలువిద్య జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. బాలవర్ధన్ స్టాండ్‌బైగా ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను, పీడీ హమీదాను ఉపాధ్యాయ బృందం అభినందించారు. కార్యక్రమంలో సీఆర్పీ రాజశేఖర్ పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత: సీఎఫ్‌వో

బండిఆత్మకూరు సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అడవులను రక్షించుకోవటం అందరి బాధ్యత అని సీఎఫ్‌వో కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన బండిఆత్మకూరు అటవీ కార్యాలయ ఆవరణంలో రూ.10 లక్షలతో నిర్మించిన నూతన కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సీఎఫ్ఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పట్టుదలతో అడవులను కాపాడుకోవాలన్న ఆకాంక్షతో పనిచేస్తే సత్ఫలితాలు ఉంటాయన్నారు. వణ్య ప్రాణుల సంరక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఎఫ్‌డీ అనురాగ్‌మీనా, ఎఫ్‌ఆర్వోలు నజీర్‌ఝా, శ్రీనివాసులు, ఉదయ్‌దీప్, సిబ్బంది, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

పెథాలజీ వైద్యుల రాష్ట్ర సదస్సు ప్రారంభం

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం క్వాంటం టెక్నాలజీ వైపు అడుగులు వేస్తోందని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజీ న్యూలెక్చరర్ గ్యాలరీలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పెథాలజీ అండ్ మైక్రో బయాలజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెథాలజీ వైద్యుల రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్, ఐఏపీఎం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ నీరజరెడ్డి, ఏపీ పాథ్కాన్ ఆర్గనైజింగ్ చైర్మన్ పెథాలజీ హెచ్‌వోడీ డా.బాలీశ్వరి తదితరులు హాజరయ్యారు. ముందుగా వైద్యులు జ్యోతి ప్రజ్వలనచేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శరీరంలోని వ్యాధులను రోగ నిర్ధారణ చేయడంలో పెథాలజీ విభాగం ఎంతో కీలకమైందని అన్నారు. ప్రతి మెడికల్ కాలేజీలో పరిశోధన కమిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. రోగుల వ్యాధు లను గుర్తించి వైద్యం అందించడంలో పెథాలజి వైద్యులు అందించే రిపోర్టులే కీలకమని అన్నారు. పెథాలజీ గతంలో కన్నా ఇప్పుడు ఎంతో పురోగతి సాధించిందన్నారు. రోగులకు ఆపరేషన్ చేయాలన్నా వైద్యం అందించాలన్నా పెథాలజీ వైద్యులు సహకారం తప్పనిసరి అని డాక్టర్ హరిచరణ్ అన్నారు. రాష్ట్రస్థాయి పెథాలజీ సదస్సు కర్నూలు మెడికల్ కాలేజీ లో నిర్వహించడం యువ వైద్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని డాక్టర్ బాలీశ్వరి పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డు వీసీ డా.ఏవీ కృష్ణమరాజు, ఐఏపీఎం సెక్రటరీ డా.మారుతి, అబ్జర్వర్ డా.శ్రీనివాసులు, కోశాధికారి డా.కుమార్ రాజు, విభాగాధిపతి పీవీ రమణబాబు, వైద్యులు అసోసియేట్ ప్రొఫెసర్ డా.రేవతి పాల్గొన్నారు.

16 నుంచి జిల్లా జట్ల ఎంపిక

నంద్యాల హాస్పిటల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు స్కూల్‌గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక పోటీలను ఈనెల 16వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్‌గేమ్ కార్యదర్శి విశ్వనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16న నంద్యాల పద్మావతినగర్ ఇండోర్ స్టేడియంలో అండర్-14, అండర్-17బాల, బాలికల జూడో జట్లను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. 17న బాక్సింగ్ అండర్-14, 17బాల,బాలికల జట్లు 18న ఫెన్సింగ్, టేబుల్‌టెన్నిస్ అండర్-14, 17బాల, బాలికల జట్లు ఎంపిక చేస్తామని వివరించారు. విద్యార్థులు అర్హతాపత్రం హెచ్‌ఎంల సంతకంతో పాటు మిడ్‌డే మిల్స్ ఫారం కూడా తీసుకురావాలని సూచించారు. లీగ్ యాప్‌లో క్రీడాకారుల రిజిస్ట్రేషన్ తప్పనిసరిఅని, సొంతకిట్లతో పోటీలో పాల్గొనాలని కోరారు.

నేడు, రేపు విలేకరులకు పునశ్చరణ తరగతులు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో, ఏపీయూడబ్ల్యూజే జిల్లాశాఖ సహకారంతో గ్రామీణ విలేకరులకు పునశ్చరణ తరగతులు శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్నట్లు ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు తెలిపారు. నగరంలోని మౌర్యఇన్‌లోగల పరిణయ ఫంక్షన్ హాలులో శనివారం ఉదయం 10 గంటలకు విలేకరుల పునశ్చరణ తరగతులు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ వ్యవహరిస్తారని, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ప్రారంభిస్తారని తెలిపారు. గౌరవ అతిథులుగా కలెక్టర్ పి. రంజిత్‌బాషా, 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సమాచారశాఖ డీడీ జయమ్మ హాజరవుతారని తెలిపారు. ఆత్మీయ అతిథులుగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ఉపాధ్యక్షుడు గోరంట్ల కొండప్ప, కార్యవర్గ సభ్యుడు కె. శ్యామ్‌సుందర్‌లాల్ పాల్గొంటారని తెలిపారు.

టెక్నాలజీకి తోడ్పాటు

రైతుల్లో మక్కువ

వ్యవసాయరంగంలో కూలీల కొరత వెంటాడుతోంది. కర్షకులకు పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి. అటు కూలీల కొరత, ఇటు పెట్టుబడి ఖర్చులు తగ్గించేందుకు రాష్ట ప్రభుత్వం డ్రోన్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. సబ్సిడీపై డ్రోన్లు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. ఐదుగురు కూలీలు చేసే పని డ్రోన్ ఒక్కటే చేస్తుంది. డ్రోన్‌తో పురుగుమందు పిచికారి చేయడంతో మొక్కలన్నింటికీ మందు సమానంగా అందుతుంది. పురుగు మందే కాకుండా ఎరువులు, విత్తనాలు పొలాల్లో డ్రోన్ల సాయంతో వెదజల్లవచ్చు. ప్రతి ఐదుగురు రైతులు కలిసి గ్రూపుగా ఏర్పాటు కావాలి. ప్రతి గ్రూపులో ఒక రైతుకు డ్రోన్ వినియోగంపై శిక్షణ కూడా ఇస్తారు.

● సబ్సిడీపై డ్రోన్లు
● ఐదుగురు రైతులతో గ్రూపు ఏర్పాటు
● యూనిట్ ధర రూ.9.80లక్షలు
● జిల్లాకు 45 డ్రోన్లు మంజూరు

రుద్రవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతులను సాంకేతిక వైపు నడిపించేందుకు రాష్ట ప్రభుత్వం దృష్టిపెట్టింది. వ్యవసాయానికి సబ్సిడీపై డ్రోన్లు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. జిల్లాకు 45డ్రోన్లు సబ్సిడీపై మంజూరు చేశారు. ఇప్పటికే సబ్సిడీపై డ్రోన్లను అందించి యువతరానికి టెక్నాలజీని తోడ్పాటు చేసింది. టెక్నాలజీని అందిపుచ్చుకుని వ్యవసాయరంగంలో రైతులు డ్రోన్లను ఉపయోగించడానికి మక్కువ చూపుతున్నారు.



మొక్కజొన్న పంటపై పిచికారి చేస్తూ..

ఒక్క రోజుల్లో 20 ఎకరాల్లో..

డ్రోన్ సాయంతో ఒకరోజు 20 ఎకరాల్లో పంటలకు పురుగుమందు పిచికారి చేయవచ్చు. ఒకవైపు సమయం, మరో వైపు పురుగుమందు ఆదా అవుతుంది. ఎకరాకు 10లీటర్ల నీటిలో కలిపి ఒకే మోతాదులో పిచికారి చేయడంతో పొలంలో సమానంగా పురుగు మందు పిచికారి చేయడానికి ఉపయోగపడుతున్నాయి. రుద్రవరం మండలంలో రైతులు డ్రోన్ల సాయంతో పురగుమందును వరి, మొక్కజొన్న పొలాలకు పిచికారి చేస్తున్నారు.



12 రోజుల పాటు శిక్షణ

రైతులు వ్యవసాయరంగంలో మేలైన వ్యవసాయం చేసేందుకు ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పడాలి. ఐదుగురిలో ఒకరు ఇంటర్మీడియట్ పాసై ఉండాలి. వారికి గుంటూరు లాంఫాంలో 12రోజుల పాటు శిక్షణ ఇస్తారు. డ్రోన్‌కు నలుగురితో పాటు శిక్షణ పొందిన ఐదో వ్యక్తి ఆధ్వర్యంలో సేవలు అందించేందుకు సౌకర్యంగా ఉంటుంది. వ్యవసాయ రంగానికి అందించే యూనిట్ ధర రూ.9.80లక్షలు ధరగా నిర్ణయించారు. రైతు గ్రూపు నుంచి (వాటాధర) రూ.1.96లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి రూ.7.84లక్షలు సబ్సిడీ కింద మంజూరవుతుంది. ఇది వ్యవసాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో మంజూరు చేయబడుతుంది. వారి పర్యవేక్షణలో డ్రోన్ సేవలు రైతులకు అందుతాయి.



డ్రోన్ వద్ద రైతులు

కూలీలతో అవసరం లేకుండా..



కూలీల అవసరం లేకుండా ఒకేరోజు ఎక్కువ మొత్తం పొలంలో డ్రోన్ సాయంతో పురుగుమందు పిచికారి చేయవచ్చు. తక్కువ సమయంలో ఎక్కువపొలం పిచికారి చేసేందుకు ఆస్కారం ఉంది.

● మైసూరారెడ్డి, రైతు, నరసాపురం

సమానంగా అందుతుంది



పురుగు మందు ప్రతి మొక్కపై సమానంగా పడుతుంది. దీంతో పురుగు చనిపోతుంది. ఇకపోతే ఓ చోట ఎక్కువ, మరో చోట తక్కువ అనేది లేకుండా ఉంటుంది. సమయం, పురుగు మందు ఆదా అవుతుంది కూడా.

● దార్వాడ హుసేన్‌బాషా, రైతు, రుద్రవరం

ఉపాధి పొందుతున్నా



వ్యవసాయంలో డ్రోన్ వినియోగం పెరగడంతో ఉపాధి పొందుతున్నా. రుద్రవరం, శిరివెళ్ల, ఆళ్లగడ్డ, దొర్నిపాడు మండలాల్లో వరి పంటపై డ్రోన్‌తో మందు పిచికారి చేస్తున్నా. రైతులకు సమయం ఆదా అవుతుంది.

● రాజు, డ్రోన్ ఆపరేటర్

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట ప్రభుత్వం డ్రోన్లను సబ్సిడీపై అందిస్తుంది. ఐదుగురు రైతులు ఒక గ్రూపుగా ఏర్పడాలి. ఒకరు ఇంటర్మీడియట్ పాసై ఉండాలి. ఇంటర్ పాసైన రైతుకు 12 రోజు పాటు డ్రోన్ నిర్వహణపై శిక్షణ ఇస్తుంది. రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలి.

● సుమతి, ఏవో, రుద్రవరం


అవినీటి కరకట్టలు

భూగర్భజలాల రీచార్జ్ కోసం నిర్మించే పెర్కోలేషన్ ట్యాంకుల నిర్మాణాల్లో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. దీంతో కొన్ని నెలలకే అవి కోతలకు గురవుతున్నాయి. ఈ ట్యాంకులను 120మీటర్ల పొడవు, 2మీటర్ల ఎత్తుతో నిర్మించాలి. ట్యాంకు నిర్మించే చోట నీరు ఆగే ప్రాంతంలో మట్టిని తీసి కరకట్టకు వేయాలి. గట్టిగా ఉండేలా రోలింగ్ చేయాలి. అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో తూతూ మంత్రంగా నిర్మాణాలు జరిగాయి. ఇటీవలే కురిసిన చిన్నపాటి వర్షాలకే కరకట్టలు కోతకు గురి అయ్యాయి. ఇక భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏమిటని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ట్యాంకుల నిర్మాణాల్లో నాణ్యతకు తిలోదకాలు
● ఏడాది గడవకముందే కోతలు
● నిర్మాణానికి మించిన అంచనా వ్యయం
● బట్టబయలు చేయని అధికారులు

కట్టపై రోలింగ్ చేయాలి

పెర్కోలేషన్ ట్యాంకులను 120మీటర్ల పొడవు, 2మీటర్ల ఎత్తుతో నిర్మించాలి. ట్యాంకు నిర్మించే చోట నీరు ఆగే ప్రాంతంలో మట్టిని తీసి కరకట్టకు వేయాలి. కరకట్ట గట్టిగా ఉండేలా కట్టపై రోలింగ్ చేయాలి. ఎక్కడి వరకైతే నీరు నిలుస్తాయో అక్కడి వరకు లోపలివైపు కట్ట దెబ్బతినకుండా రాళ్లను పొందుపరచాలి. కరకట్ట దెబ్బతినకుండా ఒక చోట తూము ఏర్పాటు చేయాలి.



కరకట్ట పై భాగంలో చీలిన దృశ్యం

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భూగర్భజలాల రీచార్జింగ్ కోసం నీటి ప్రవాహాలకు అడ్డంగా నిర్మించిన పెర్కోలేషన్ ట్యాంకు(కృత్రిమ జలాశయాలు) నిర్మాణాలు నాసిరకంగా జరిగాయన్న ఆరోపణలున్నాయి. ఈట్యాంకులు నిర్మించి ఏడాది గడవక ముందే కరకట్టలు చిన్నపాటి వర్షాలకే కోతలకు గురువుతున్నాయి. నిర్మాణ సమయంలో అధికారులు సరిగా పర్యవేక్షించకలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మైక్రో వాటర్ షెడ్‌కింద ఒక్కొక్కటి రూ.7.09 లక్షల అంచనా వ్యయంతో ఎమ్మిగనూరు మండలంలోని వెంకటగిరి గ్రామ సమీపంలో ఉన్న బనవాసి అటవీ క్షేత్రం, కడివెళ్ల గ్రామ సమీపంలోని కొండ దగ్గర ట్యాంకులు నిర్మిచా రు.



రాళ్లు పెట్టి వదిలేశారు

ట్యాంకులను 120మీటర్ల పొడవు, 2మీటర్ల ఎత్తు నిర్మించినప్పటికి కట్ట బలంగా ఉండేందుకు రోలింగ్ చేసిన దాఖలాలు కనిపించటం లేదు. కరకట్ట లోపల భాగం నీరు ఎక్కడవరకు నిలుస్తాయో అక్కడివరకు రాతిపరుపు ఏర్పాటు చేయాల్సి ఉండగా కట్ట మధ్యలో మాత్రమే రాళ్లు పెట్టి వదిలేశారు. కడివెళ్లలో మధ్యలో కొంతమేర వదిలేసి రాళ్లు పరిచారు.

భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి

ఇటీవల కురిసిన వర్షాలకు కరకట్ట కోతలకు గురైంది. కట్ట ఆచివరి నుంచి ఈ చివరివరకు కట్టపై నుంచి నీరు పారి కోత కోసుకుపోయింది. అంతేగాకి కట్టపైభాగంలో నెర్రెలు ఇవ్వడం పనులు ఎంత నాణ్యతా ప్రమాణాలతో జరిగాయో ఇట్టే తెలుస్తోంది. భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏమిటని ఆయా గ్రామాల ప్రజలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

వాస్తవంగా ఎంత ఖర్చు చేశారో..

మైక్రోవాటర్ షెడ్ కందనాతి కింద బనవాసి అటవీ క్షేత్రంలో, కడివెళ్ల గ్రామ సమీపంలోని పెద్దయ్య పొలం దగ్గర పెర్కోలేషన్ ట్యాంకులను నిర్మించారు. అంచనా వ్యయం ఒక్కోక్క ట్యాంకు నిర్మాణానికి రూ.7లక్షలు అయితే దాదాపు రూ.6 నుంచి రూ. 8 లక్షల మేర ఖర్చుచేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ట్యాంకు నిర్మించిన ప్రాంతంలో అంచనా వ్యయం మాత్రమే రాసి వాస్తవంగా ఎంత ఖర్చు చేశారో మాత్రం రాయలేదు.

ట్యాంకులు దెబ్బతింటే మరమ్మతులు చేయిస్తాం

పెర్కోలేషన్ ట్యాంకులు నాణ్యతా ప్రమాణాలతో నిర్మించారు. ట్యాంకులు దెబ్బతిని మరమ్మతులకు గురైతే ఏవాటర్ షెడ్ కమిటీ పనులు చేసి ఉంటారో ఆ కమటీతోనే మరమ్మతులు చేయిస్తాం. కొంత మొత్తం కమిటీ దగ్గర ఉంటుంది.

● వలి బేగ్, ఏపీడీ, కర్నూలు



వర్షాలకు కట్టకు కోతలు పడిన దృశ్యం



బనవాసి అటవీ క్షేత్రంలో నిర్మించిన పెర్కోలేషన్ ట్యాంకు

ప్రతిభకు ప్రోత్సాహం

● సృజనాత్మకతను వెలికితీస్తున్న హెచ్‌ఎం సురేష్‌బాబు
● 'చిన్నారిలోకం'లో విద్యార్థులు



కర్నూలు ఆకాశవాణి కేంద్రంలో చిన్నారిలోకం కార్యక్రమంలో పాల్గొన్న డోన్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

డోన్ రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని ప్రతిభను ప్రోత్సహించేందుకు ఆ ఉపాధ్యాయుడు నిరంతరం కృషిచేస్తున్నారు. వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రయత్నం చేశారు. అందులో భాగంగా ఆకాశవాణిలో 'చిన్నారిలోకం' కార్యక్రమంలో పాల్గొనేలా చొరవ చూపాడు. ప్రభుత్వ నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోగాట సురేష్‌బాబు. విద్యార్థులను ఏటా కర్నూలు లోని ఆకాశవాణి కేంద్రానికి తీసుకెళ్తారు. అక్కడ 'చిన్నారిలోకం' కార్యక్రమంలో పాల్గొని వారి ప్రతిభకు ప్రోత్సాహం అందేలా కృషి చేస్తున్నారు. 2024 ఆగస్టు నెలలో, ఈ ఏడాది జనవరిలో పాఠశాలకు చెం దిన పదో తరగతి విద్యార్థులు రమ్య, బన్ని, వీరేంద్ర, బ్రహ్మేంద్ర, 9వ తరగతి విద్యార్థినులు సాలమ్మ, మాధురి, 8వ తరగతి విద్యార్థినులు మహాలక్ష్మి, కామాక్షి, 7 వ తరగతి విద్యార్థినులు దీపిక, అంజలిల ప్రతిభను గుర్తించి 'చిన్నారిలోకం' పాల్గొనేటట్లు చొరవ చూపించారు. వారితో దేశభక్తి, లలిత, జానపద గీతాలు, బాలగేయాలు, సామెతలు, పొడుపు కథలు, శతక పద్యాలు, శ్లోకాలు పాటలు, నాటికల ద్వారా చేయించి వారి ప్రతిభతో బహుమతులు అందుకునేలా చేశారు.

చదువుతో పాటు ఇతర రంగాల్లో..



ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహిస్తున్నాం. చదువుతో పాటు ఇతర రంగాల్లో వారికు న్న ప్రతిభను గుర్తించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడం లక్ష్యం.

● తోగాట సురేష్‌బాబు, హెచ్‌ఎం, నెహ్రూనగర్, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, డోన్

జిల్లాలో 80 సీజనల్ వసతి గృహాలు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో వలస వెళ్తున్న తల్లిదండ్రుల పిల్లలు డ్రాపౌట్స్ కాకుండా జిల్లాలో 80 సీజనల్ వసతి గృహాలు (సీజనల్ హాస్టల్స్) ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడుమూరు, తుగ్గలి, పత్తికొండ, క్రిష్ణగిరి, ఆదోని, మంత్రాలయం, కౌతాళం, కోసిగి, హోళగుంద, హాలహర్వి, మద్దికెర, పెద్దకడుబూరు మండలాల్లో సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కావున ఆసక్తి గలిగి ఉండి సేవాభావం కలిగిన పొదుపు సంఘాలు, ఎన్జీవోలు 2025-26 విద్యాసంవత్సరానికి గానూ సీజనల్ హాస్టల్స్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు అన్ని డాక్యుమెంట్లతో ఈ నెల 16వ తేదీన సాయంత్రం 5 గంటలలోపు సమగ్ర శిక్ష కార్యాలయంలో సమర్పించాలని తెలియజేశారు.

అవినీతి అధికారులపై చర్యలు

• ఉత్తర్వులు ఇచ్చిన ఏపీ ఉప లోకాయుక్త రజనీ

కల్లూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల తసీల్దార్‌గా గతంలో పనిచేసి అవినీతికి పాల్పడ్డ టి.అంజనాదేవి, వీఆర్వో కేఎల్ వరప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీ ఉప లోకాయుక్త పి.రజనీ ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లాకు చెందిన వి.మురళీధర్‌రెడ్డి ప్రభుత్వ ఉద్యోగులైన అప్పటి కల్లూరు తహసీల్దారు టి.అంజనాదేవి, లక్ష్మీపురం వీఆర్వో కేఎల్ వరప్రసాద్ కలిసి దూపాడు సర్వే నెంబర్ 15-4లో రూ.4 లక్షలు లంచం తీసుకుని చట్టవిరుద్ధంగా కొందరికి నకిలీ ఇంటి స్థల పట్టాలు జారీ చేశారని ఆరోపిస్తూ ఏపీ లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ఏపీ ఉప లోకాయుక్త పి.రజనీ సదరు ఫిర్యాదుపై విచారణ జరిపి ఉత్తర్వులు జారీ చేశారు. సంస్థ ఆదేశాలను అనుసరించి ఏపీ ప్రభుత్వ భూపరిపాలన ప్రధాన కమిషనర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కర్నూలు జాయింట్ కలెక్టర్ ద్వారా విచారణ నిర్వహించి టి.అంజనాదేవి, కేఎల్ వరప్రసాద్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకొని మాజీ తసీల్దారుకు ఒక సంవత్సరం పాటు వేతన శ్రేణి తగ్గింపు (పెన్షన్‌పై ప్రభావం పడకుండా), కేఎల్ వరప్రసాద్‌కు రెండు వార్షిక వేతన ఇంక్రిమెంట్లు నిలిపివేశారు.

మోడల్ స్కూల్‌లో తేనెటీగల దాడి

• 112 మంది విద్యార్థులకు గాయాలు


విద్యార్థులను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

కోడుమూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోడల్ స్కూల్ విద్యార్థులపై శుక్రవారం తేనెటీగలు దాడి చేశాయి. మధ్యాహ్నం భోజన సమయం విరామంలో విద్యార్థులు భోజనం చేస్తుండగా ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. దీంతో తేనెటీగల దాడికి విద్యార్థులు అరుపులు కేకలు వేస్తూ పరుగులు తీశారు. తేనెటీగల దాడిని పసిగట్టిన ఉపాధ్యాయులు వెంటనే విద్యార్థులను తరగతి గదిలోకి తరలించారు. అయితే తేనెటీగల దాడిలో సుమారు 112 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. దీంతో ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి విద్యార్థులను స్థానిక ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. ఈ దాడిలో ముగ్గురు విద్యార్థులకు మాత్రమే తీవ్రగాయాలు కాగా.. మిగతా మిగిలిన విద్యార్థులకు స్వల్ప గాయలు కావడంతో చికిత్సను అందించి ఇంటికి పంపించారు. చికిత్స అనంతరం ముగ్గురు విద్యార్థులు కూడా క్షేమంగా ఉన్నారని డాక్టర్ నాగరాజు చెప్పారు. టీడీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, నాయకులు బలరాం, గోపాల్‌నాయుడు, రవీంద్రగౌడ్ ఆసుపత్రిలో విద్యార్థులను పరామర్శించారు.

బస్సు ఢీ.. యువకుడి దుర్మరణం

హొళగుంద, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులో ఆర్టీసీ బస్సును వెనక నుంచి ఢీ కొని యువకుడు మృతి చెందాడు. వివరాల మేరకు.. పెద్దహ్యాట గ్రామానికి చెందిన రంజిత్(18) హొళగుందలోని ఫొటో స్టూడియోలో పనిచేస్తుండేవాడు. శుక్రవారం ఉదయం సులువాయికి చెందిన చిన్న ద్యావన్న అనే వ్యక్తితో కలిసి బైక్‌పై రంజిత్ బయలుదేరాడు. హొళగుంద సమీపంలోని శబరి ఆశ్రమం వద్ద, ఆలూరు నుంచి హొళగుంద మీదుగా ఆదోనికి వెళ్లే ఏపీఎస్‌ఆర్టీసీ బస్సు డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న బైక్ బస్సును ఢీ కొంది. దీంతో బైక్‌పై వెనకవైపు కూర్చున్న రంజిత్ ఎగిరి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. హొళగుంద ప్రభుత్వ అస్పత్రికి, అనంతరం ఆదోనికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడు తండ్రి రంగస్వామి పిర్యాదు మేరకు డ్రైవర్ హనుమంతును అదుపులోకి తీసుకుని బస్సును సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ దిలీప్ కుమార్ తెలిపారు. కాగా అంబులెన్సు అందుబాటులోకి లేకపోవడం, తీవ్ర రక్తస్రావం కావడంతో మృతిచెందినట్లు బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.


రంజిత్ (ఫైల్)

ట్రాక్టర్ బోల్తా.. ఒకరి మృతి

వెలుగోడు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో ఓ ట్రాక్టర్ వ్యవసాయ కూలీలతో వెళ్తూ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా, మరి కొందరు స్వల్పంగా గాయపడ్డారు. ఈ సంఘటన శుక్రవారం వెలుగోడులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన గాదే రామాంజనేయులు భార్య గాదే గురులక్ష్మీదేవి (45) తన పంట పొలానికి ఎరువులు, వ్యవసాయ కూలీలతో ట్రాక్టర్‌పై బయలుదేరారు. అయితే గ్రామ శివారులోని గాలేరు నది సమీపంలో గంగమ్మ మలుపు వద్ద ట్రాక్టర్ ట్రాలీ అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సమయంలో ట్రాక్టర్‌లో సుమారు 14 మంది కూలీలు ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో కూలీలపై ఎరువు బస్తాలు పడడంతో గాదే గురులక్ష్మీదేవి అక్కడికక్కడే మృతి చెందింది. ఫైజూన్ అనే మరో మహిళ తీవ్రంగా గాయపడింది. బాధితులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్సలు చేసి, మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.


గురులక్ష్మీదేవి (ఫైల్)

మహిళ ఆత్మహత్య

పెద్దకడబూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేకడోణ గ్రామానికి చెందిన హసీనా(35) శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. రెహంతుల్లాకు ఎమ్మిగనూరు మండలం టీఎస్ కూలురు గ్రామానికి చెందిన హసీనాతో 2006 లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుర్లు, ఒక కూమారుడు సంతానం. కొన్ని రోజులుగా కుటుంబ కలహాలతో భార్యాభర్తలిద్దరూ గొడవ పడుతూ ఉండేవారు. శుక్రవారం కూడా గొడవ పడ్డారు. క్షణికావేశానికి గురైన హసీనా ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హూటాహూటిన ఆదోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హసీనా మృతి చెందింది. మృతురాలు తండ్రి మోదీంసాబ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణంలో చోరీ

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని ఫైర్ స్టేషన్ దగ్గరలోని హేమంత్ వైన్స్‌లో దొంగతనం జరిగింది. పట్టణ సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలివీ.. పట్టణ శివారులోని హేమంత్ వైన్స్‌లో కుమ్మరి వీధికి చెందిన కుమ్మరి నాగరాజు క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. 11వ తేదీ కలెక్షన్ రూ.90 వేలను దుకాణంలో ఉంచాడు. శుక్రవారం యథావిధిగా షాపు తెరిచి చూడగా వెనుక నుంచి రేకుల షెడ్డును తొలగించి నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగలిం చారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బార్ల దరఖాస్తుకు గడువు పొడిగింపు

కర్నూలు అర్బన్ సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏడు పెండింగ్ బార్లకు సంబంధించి దరఖాస్తులను స్వీకరణకు ఈ నెల 17 వరకు గడువు పొడిగించారు. ఈ నెల 3వ తేదీన నోటిఫికేషన్ జారీ చేసి 14తోనే ముగియాల్సి ఉన్న ప్రక్రియకు ఆశించిన మేర దరఖాస్తులు రాకపోవడంతో ప్రభుత్వం మరోసారి గడువు పొడిగించింది. కర్నూలు 4, ఎమ్మిగనూరు 2, గూడూరు 1 బార్‌కు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి దరఖాస్తులు వేసేందుకు యజమాన్యాలు ముందుకు రాలేదు.

కేజీబీవీ తనిఖీ

ఆత్మకూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కస్తుర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని శుక్రవారం ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమల దేవి ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఆహార నాణ్యతను స్వయంగా రుచి చూసి పరిశీలించారు. అలాగే స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచి సరుకులను తనిఖీ చేసి గడువు తీరిన సరుకులు ఉన్నాయా? అని తనిఖీ చేశారు. అలాగే కేజీబీవీలో అందుతున్న సౌకర్యాలు, ఆహార పదార్థాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి రవిబాబు, జిల్లా మేనేజర్ అశ్వర్థనారాయణ నాయక్, తహసీల్దార్ రత్నరాధిక, డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, సోషల్ వేల్ఫేర్ అధికారి అంకన్న, బీసీ, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఉన్నారు.


కస్తూర్బాలో ఆహారాన్ని పరిశీలిస్తున్న గంజిమల దేవి

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

• రోడ్డెక్కిన బాధిత కుటుంబ సభ్యులు • పోలీసులు, ఆందోళనకారుల మధ్య వాగ్వాదం


దేవనకొండ బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న ఆందోళనకారులు

దేవనకొండ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): చిన్నారిని చంపి, భార్యపై కర్కశంగా దాడి చేసిన భర్త నరేష్‌ను కఠినంగా శిక్షించాలంటూ బాధిత కుటుంబ సభ్యులు, సీపీఐ, సీపీఎం, లోక్‌సత్తా, జనసేన పార్టీల నాయకులు రోడ్డెక్కారు. ముందుగా చాకలి వీధిలోని నరేష్ ఇంటిపై శ్రావణి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు దాడి చేసి ఇంట్లో ఉన్న సామగ్రిని ధ్వంసం చేసి, బస్టాండ్‌కు చేరుకొని ధర్నా చేశారు. శ్రావణికి న్యాయం చేసి బాలుడు సాగర్‌ను నీటి డ్రమ్ములో ముంచి హత్యచేసిన తండ్రిని శిక్షించాలంటూ, దా దాపు ఐదు గంటలపాటు దేవనకొండ-కర్నూలు రహదారిపై ఆందోళన చేశారు. పలుమార్లు ఆందోళన విరమించాలని పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య, సీఐ వంశీనాథ్ నచ్చజెప్పే ప్రయత్నం చేసి విఫలయత్నం అయ్యారు. ఓ సందర్భంలో పోలీసులు, ఆందోళనకారుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో పలువురు ఆందోళనకారులు పోలీసులు జోక్యం చేసుకొని పరిస్థితులను సద్దుమణిగించారు. ఐదు గంటలపాటు రహదారిపై ధర్నాలో వాహనాలు ఆగిపోవ డంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. డీఎస్పీతోపాటు, పరిసర ప్రాంతాల సీఐలు జయ్యన్న, పులిశేఖర్, గంగధర్, నల్లప్ప, ఆందోళనకారులను శాంతింపజేస్తూ పరిస్థితులను తమ అదుపులోకి తెచ్చుకొని వాహనాలను తరలించారు. అనంతరం ఆందోళన కారులతో మాట్లాడి ధర్నాను విరమింపచేశారు. పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య మాట్లాడుతూ చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. శ్రావణికి న్యాయం చేస్తామన్నారు.


మహిళలకు నచ్చజెప్పుతున్న డీఎస్పీ వెంకట్రామయ్య


నిందితుడు సాకే రాజుకుమార్

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష

కర్నూలు లీగల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మాయమాటలు చెప్పి బాలికను కిడ్నాప్ చేసి ఆ తర్వాత పలుమార్లు అత్యాచారం చేసిన నిందితుడిపై నేరం రుజువు కావడంతో 20 సంవత్సరాల కారాగార శిక్ష, రూ.35 వేలు జరిమానా విధిస్తూ కర్నూలు పోక్సో కోర్టు న్యాయాధికారి ఈ.రాజేంద్రబాబు శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. నంద్యాలకు చెందిన బాలిక తల్లిదండ్రులు చిరు వ్యాపారం చేసుకుంటూ వారి పిల్లలను చదివించుకుంటుండేవారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో రోజూ వచ్చి నంద్యాలలో ఉంటున్న సాకే రాజ్‌కుమార్ అలియాస్ పెద్ద ఆ బాలికకు మాయమాటలు చెప్పేవాడు. ఈ క్రమంలో 2018 నవంబరు 14న బాలికకు మాయమాటలు చెప్పి కర్నూలు తీసుకెళ్లి అక్కడి నుంచి బస్సులో విజయవాడకు తీసుకెళ్లాడు. రాజుకుమార్ విజయవాడలో తన తల్లి వద్దకు తీసుకెళ్లి బాలికను పరిచయం చేశాడు. ఆ తర్వాత నిందితుడు ఆ బాలికను తన ఇంట్లో ఉంచుకుని పలుమార్లు అత్యాచారం చేశాడు. తిరిగి నిందితుడు ఈ బాలికను హైదరాబాదుకు తీసుకెళ్లి ఓ లాడ్జిలో ఉంచి పలుమార్లు అత్యాచారం చేశాడు. 2019 మార్చి 10వ తేదీన బాలిక తప్పించుకుని నంద్యాలకు చేరుకుని జరిగిన విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పింది. కూతురు కనిపించకపోవడంతో బాలిక తల్లిదండ్రులు నంద్యాల పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బాలిక తల్లిదండ్రులతో కలిసి నంద్యాల పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసును మార్చి కిడ్నాప్, అత్యాచారం సెక్షన్ల కింద నిందితుడిపై కేసు నమోదు చేశారు. పోలీసులు కేసును విచారించి నిందితుడితో పాటు అతడి తల్లిదండ్రులు, బంధువులపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. అయితే కోర్టులో సాకే రాజ్‌కుమార్‌పై మాత్రమే నేరం రుజువు కావడంతో అతడికి 20 సంవత్సరాల కారాగారశిక్షతో పాటు రూ.35 వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. బాధిత మహిళకు రూ.2 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. ప్రాసిక్యూషన్ తరుపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీవీ శ్రీనివాసులు వాదించారు.

అన్ని మతాలను గౌరవిస్తాం


మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్ సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అన్ని మతాలను తాను సమానంగా గౌరవిస్తామని పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. నగరంలోని 10వ వార్డులో ఆధునీకీకరించిన ధర్వేశ్ ఖాద్రి దర్గాను మంత్రి టీజీ భరత్ సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మహబూబ్ ఆధ్వర్యంలో మసీదు కమిటీ ప్రతినిధులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. మసీదులో విద్యనభ్యసించే విద్యార్థులకు మంత్రి టీజీ భరత్ చేతుల మీదుగా సైకిళ్లను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు నూరి మన్సూర్, ఆలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దొంగ అరెస్టు.. 32 బైకులు స్వాధీనం

కర్నూలు క్రైం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు బైకు దొంగతనాలకు పాల్పడుతున్న జయంత్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 32 బైకులను స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ బాబు ప్రసాద్, టూటౌన్ సీఐ నాగరాజురావు, ఎస్‌ఐలు సతీష్, మల్లికార్జున శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం గద్వాల పట్టణానికి చెందిన జయంత్ సులువుగా డబ్బులు సంపాదించేందుకు చోరీ చేయడం మొదలు పెట్టాడు. చోరీ చేసిన బైకులను రూ.5వేలు, రూ.10వేలకు విక్రయించి వచ్చిన డబ్బులో జల్సా చేస్తుంటాడు. నిందితుడు కర్నూలులోని పలు హాస్పిటల్స్, కూడళ్ల వద్ద చోరీ చేసినట్లు గుర్తించారు. నిందితున్ని పట్టుకోవడానికి స్పెషల్ టీమ్ ఏర్పాటు చేసి 32 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

కోడుమూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని రవీంద్ర వైన్స్ దగ్గర ఈ నెల 6న జరిగిన గిరి హత్య కేసులో నిందితుడు పింజరి మౌలాలిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ మహమ్మద్ తబ్రేజ్ తెలిపిన వివరాలివీ.. మండలంలోని వెంకటగిరి గ్రామానికి చెందిన గిరి, మౌలాలి స్నేహితులు. గిరి తన స్నేహితుడు మౌలాలికి, అతడి సోదరిడికి తరచూ గొడవలు సృష్టించేవాడు. దీంతో గిరిని హతమార్చాలని మౌలాలి పథకం వేసుకొన్నాడు. ఈ నెల 6న గిరిని మద్యం తాగడానికి ఆహ్వానించాడు. మద్యం సేవించిన అనంతరం తన వెంట తెచుకొన్న కత్తితో గిరి దాడి చేసి గొంతు కోసి హత్య చేశాడు. ఎస్‌ఐ డీవై స్వామి, మణికంఠ ఉన్నారు

ఉల్లి రైతులకు భరోసా


రైతులతో మాట్లాడుతున్న జేసీ నవ్య

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు అమ్మకానికి తెచ్చిన ఉల్లిని మొత్తం కొనుగోలు చేసి వారికి భరోసా కల్పిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య తెలిపారు. ఇప్పటికే క్వింటా రూ.1,200తో కొనుగోలు చేసిన రైతుల బ్యాంకు ఖాతాలకు వ్యత్యాసం ఉన్న నగదును జమ చేస్తున్నామన్నారు. శుక్రవారం జేసీ నవ్యతో పాటు మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డీడీ ఉపేంద్ర, ఏడీఎంలు సత్యనారాయణ చౌదరి, నారాయణ మూర్తి, కర్నూలు మార్కెట్ కమిటి సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మితో కలిసి రైతులతో మాట్లాడారు. రైతులు తెచ్చిన ఉల్లిలో 6,749 క్వింటాళ్ల వ్యాపారస్తులతో కొనుగోలు చేయించామని, మిగిలిన 5,576 క్వింటాళ్ల ఉల్లిని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడం జరిగిందని జేసీ వివరించారు. మీరు తెచ్చిన ప్రతి ఉల్లి గడ్డను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, ప్రతి రైతుకు క్వింటాకు రూ.1,200 ధర అందిస్తున్నామనీ స్పష్టం చేశారు. ఇప్పటికే రూ.కోటి రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశామన్నారు. రైతులు పక్వానికి వచ్చిన ఉల్లినే మార్కెట్ కు తీసుకురావాలని, పొలాల వద్దనే గ్రేడింగ్ చేసి తెస్తే యార్డులో అమ్మకం కోసం కష్టాలు పడాల్సిన ఇబ్బంది ఉండదని జేసీ తెలిపారు. రైతులు తెచ్చిన ఉల్లిని త్వరితగతిన కొనుగోలు చేసి బయటకు తరలించాలని వ్యాపారులు, మార్క్‌ఫెడ్ అధికారులను జేసీ ఆదేశించారు. జేసీ వెంట కర్నూలు మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ శేషగిరిశెట్టి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, కోడుమూరు సెక్రటరీ సుందర్‌రాజు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, నగేష్, శివన్న తదితరులు ఉన్నారు.

వాహనాలు సీజ్

• రూ.2.4 లక్షలు జరిమానా

మహానంది, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులపల్లి అంకిరెడ్డి చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఆరు టిప్పర్లను సీజ్ చేసి రూ.2 లక్షల 40 వేల జరిమానాను విధించినట్లు విజిలెన్స్ ఎస్‌ఐ వెంకట ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఇటీవల మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది అర్ధరాత్రి గాజులపల్లి వైపు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న 6 టిప్పర్లను గుర్తించి స్వాధీనం చేసుకొన్నారు. వీటిని మహానంది పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇందులో భాగంగా టిప్పర్లు అధిక లోడుతో ఉన్నట్లు గుర్తించి జరిమానాలు విధించినట్లు విజిలెన్స్ ఎస్‌ఐ చెప్పారు.

కలెక్టర్ సిరికి ఘన స్వాగతం

• నేడు బాధ్యతల స్వీకరణ



నూతన కలెక్టర్‌కు బొకే ఇస్తున్న జేసీ నవ్య, డీఆర్వో వెంకటనారాయణమ్మ

కర్నూలు కలెక్టరేట్/ఓర్వకల్లు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కలెక్టరేట్‌లో శనివారం నూతన కలెక్టర్ సిరి బాధ్యతలు స్వీకరించనున్నారు. నగరంలోని స్టేట్‌గెస్ట్ హౌస్‌లో జిల్లా కలెక్టర్‌ని జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, డీఆర్వో వెంకట నారాయణమ్మ, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. అంతకు ముందు ఓర్వకల్లు విమానాశ్రయంలో కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, తహసీల్దార్ విద్యాసాగర్ ఘన స్వాగతం పలికారు.

నగరడోణలో డెంగీ పాజిటివ్

ఆలూరు(చిప్పగిరి), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిప్పగిరి మండలం నగరడోణ గ్రామంలో డెంగీ పాజిటివ్ నిర్ధారణ అయింది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈనెల 1వ తేదీ నుంచి తీవ్ర జ్వరంతో బాధపడుతూ కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అక్కడి వైద్యులు డెంగీ పాజిటివ్‌గా నిర్ధారించినట్లు వైద్యాధికారి అఫ్రోజ్‌జహాన్ తెలిపారు. శుక్రవారం అధికారులు అప్రమత్తమ య్యారు. గ్రామంలో యాంటీ లార్వా లిక్విడ్ పిచికారీ చేయించారు. వైద్యశిబిరం నిర్వహించి, గ్రామస్థుల నుంచి రక్త నమూనాను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలేరియా అధికారి వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.


గ్రామంలో రక్త పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి అఫ్రోజ్‌జహాన్

యూరియా బస్తాల సీజ్

పాణ్యం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువులు, రసాయన మందుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. పాణ్యంలోని శ్రీవెంకటేశ్వర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణంలో అక్రమంగా నిల్వ ఉన్న రూ.15,457 విలువైన 58 బస్తాల యూరియాను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పాణ్యం ఎంఏవో జయప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో కర్నూలు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి విశ్వనాథ్, ప్రత్యేక తహసీల్దారు వెంకటనారాయణ పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

కర్నూలు లీగల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజీకి వీలున్న క్రిమినల్, సివిల్, ప్రిలిటిగేషన్ కేసులు ఈజాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరిం చుకోవచ్చని అన్నారు. ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరిం చేందుకు పలు బెంచీలను ఏర్పాటుచేశామన్నారు. ప్రతి బెంచ్‌లో ఒక న్యాయాధికారి, ప్యానెల్ న్యాయవాది, పారా లీగల్ వలంటరీ సభ్యులుగా ఉంటారని తెలిపారు.

ఉల్లిని కొనుగోలు చేస్తాం: జేసీ



రైతులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతులు అమ్మకానికి తెచ్చిన ఉల్లిని మొత్తం కొనుగోలు చేయించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటోందని జాయింట్ కలెక్టర్ బి.నవ్య అన్నారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ డా.నవ్యతోపాటు మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు, డీడీ ఉపేంద్ర, ఏడీఎంలు సత్యనారాయణ చౌదరి, నారాయణమూర్తి, కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మితో కలిసి మార్కెట్ యార్డును పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో జేసీ మాట్లాడుతూ రైతులు తెచ్చిన ఉల్లిలో 6,749 క్వింటాళ్లు వ్యాపారులతో కొనుగోలు చేయించామని, మిగిలిన 5,576 క్వింటాళ్ల ఉల్లిని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేశామని చెప్పారు. ప్రతి రైతుకు క్వింటానికి రూ.1,200 ధర అందిస్తున్నామన్నారు. జేసీ వెంట కర్నూలు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేషగిరిశెట్టి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, కోడుమూరు సెక్రెటరీ సుందర్‌రాజు, సూపర్‌వైజర్లు ఉన్నారు.

విద్యార్థులు కలలను సాకారం చేసుకోండి

సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాల లత



బాల లతను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తాము కన్న కలలను సాకారం చేసుకోవాలని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ బాల లత అన్నారు. శుక్రవారం స్థానిక అశోక మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. బాలలత ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సమాజసేవలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం బాలలతను కళాశాల యాజమాన్యం సన్మానించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.నవీర్, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

20న నగర బ్రాహ్మణ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న సండేల్ చంద్రశేఖర్

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నగర బ్రాహ్మణ సంఘం సర్వసభ్య సమావేశం ఈనెల 20న సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ తెలిపారు. ముఖ్య అతిథిగా ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ హాజరవుతారన్నారు. శుక్రవారం హరిహర క్షేత్రంలో విలేకర్ల సమావేశంలో సండేల్ చంద్రశేఖర్ మాట్లాడారు. వివిధ కార్పొరేషన్లకు డైరెక్టర్లుగా నియమితులైన డైరెక్టర్లను ఈ సమావేశంలో సత్కరిస్తామన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు చెరువు వెంకట దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పేద బ్రాహ్మణులకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వృద్ధాప్య, వితంతు పింఛన్లపై సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. సంఘం కార్యదర్శి చల్లా నాగరాజ శర్మ, సలహాదారులు టీవీ రవిచంద్రశర్మ, సముద్రాల శ్రీధర్, కోశాధికారి సీఎస్ ప్రసాదరావు, రాధాకృష్ణ, ఆలయ అర్చకుడు ప్రసన్న శర్మ పాల్గొన్నారు.

చదరంగం పోటీల పోస్టర్ విడుదల



పోస్టర్‌ను విడుదల చేస్తున్న మాజీ ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి, ఎంపీ, ఎమ్మెల్యేలు

కర్నూలు రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం మాజీ ఎంపీపీ దివంగత యువ నాయకుడు రాజవర్దన్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని అంతర్జాతీయ చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు టోర్నమెంటు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కర్నూలులోని మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి స్వగృహంలో ఆయన చేతుల మీదుగా పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, పత్తికొండ, కోడుమూరు ఎమ్మెల్యేలు కేఈ శ్యామ్‌బాబు, దస్తగిరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



ప్రతిజ్ఞ చేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు

కల్లూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఉలిందకొండ జడ్పీ పాఠశాల హెచ్‌ఎం ఎం.లీలావతి అన్నారు. భారత ప్రభుత్వ ప్రసార మంత్రిత్వశాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కర్నూలు ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలలో ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా అమ్మ పేరిట మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు ప్రతి జ్ఞ చేశారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ కర్నూలు సిబ్బంది ఫణికుమార్, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లి పంట పరిశీలన

ఓర్వకల్లు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నన్నూరు గ్రామంలో శుక్రవారం ఉద్యాన శాఖ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసులు ఉల్లి పంటను పరిశీలించారు. అనంతరం రైతులతో ముఖాముఖి చర్చ నిర్వ హించారు. అదేవిధంగా డ్రిప్ ద్వారా సాగు చేసే ఉద్యాన పంటలను పరిశీలిం చారు. ఆయన వెంట జిల్లా ఉద్యానశాఖ అధికారి రామాంజనేయులు, ఏపీఎంఐసీ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్ ఉన్నారు.

ఇరుకు రోడ్లు.. ప్రజల పాట్లు..!

- విస్తరణ మరిచిన అధికారులు
- పెరుగుతున్న జనాభా..
- ట్రాఫిక్‌కు తప్పని అంతరాయం

గూడూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇరుకైన రోడ్లతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గూడూరు నగర పంచాయతీగా 2011 సంవత్సరంలో ఏర్పడింది. పట్టణ జనాభా దాదాపు 30 వేలకు పైగా ఉంది. నగర పంచాయతీ ఏర్పాటై పదమూడేళ్లు గడుస్తున్నా పట్టణంలో రహదారుల విస్తరణ ఊసే కనిపించడం లేదు. 2016 సంవత్సరంలో అప్పటి పాలక వర్గం, కమిషనర్ నేతృత్వంలో పట్టణంలో రహదారుల విస్తరణకు సర్వే పనులు చేపట్టారు. ఆక్రమణకు గురైన ప్రాంతాలను గుర్తించి మార్కింగ్ వేశారు. దాదాపు ఏడు, ఎనిమిది ఏళ్లు కావస్తున్నా విస్తరణ మాట నీటి మీద రాత లాగే మారింది. విస్తరణ పనులు చేపట్టకూడదని అప్పట్లో కొందరు అడ్డంకులు సృష్టించారు. రహదారి విస్తరణపై పాలక మండలి తీర్మానం కూడా చేసింది. ఇలా రోజులు మారుతున్న రోడ్డు విస్తరణ మాత్రం కలగానే మిగిలింది.

ఎక్కడ పడితే అక్కడ..

పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. ఇరుకు రోడ్లతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ తోపుడు బండ్లు నిలిచి ఉండటంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందని వాహనదారులు వాపోతున్నారు. కర్నూలు - ఎమ్మిగనూరు రహదారితోపాటు, గూడూరు-కోడుమూరు రహదారిలో విస్తరణ చేపట్టి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



గూడూరులో అడ్డదిడ్డంగా వాహనాలు

బాధితులకు పరిహారం అందించాలి



ఇరుకు రోడ్లతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గూడూరులో రోడ్ల విస్తరణ చేపట్టి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి. అలాగే రోడ్ల విస్తరణలో నష్టపోయిన బాధితులకు పరిహారం అందించాలి.

● మఠం మల్లికార్జున, గూడూరు

'ఆటో మిత్ర'తో చేయూత

● టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు, ఆటో డ్రైవర్లు

ఓర్వకల్లు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు ఆర్థిక చేయూత అందించేందుకు కూటమి ప్రభుత్వం ఆటోమిత్ర పథకాన్ని అమలు చేసిందని నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో మల్లెల రాజశేఖర్‌తోపాటు కాల్వబుగ్గ మాజీ చైర్మన్ చంద్రపెద్దస్వామి, ఆటో డ్రైవర్లు సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం గ్రామంలో ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఏడాదికి రూ.15వేలు చెల్లిస్తామని చెప్పిందని, దసరా నుంచి ఈ పథకం అమలు అవుతుందని అన్నారు. నాయకులు మహబూబ్ బాషా, కేవీ మధు, కాటినేని నారాయణ, కాకి దేవేంద్ర, బజారు, షమీవుల్లా, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాధాకృష్ణ
- సీతారాం ఏచూరికి ఘన నివాళి



కర్నూలులో సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సీపీఎం పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పీఎస్ రాధాకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సుందరయ్య కూడలిలో సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం 10 గంటలకు ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో జరిగే వర్తమాన రాజకీయాలు-సీపీఎం వైఖరి అనే అంశంపై జరిగే సభను వామపక్ష, ప్రజాతంత్ర వాదులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కమిటీ సభ్యుడు వై.నగేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు టి.రాముడు, ఎండీ ఆనంద్‌బాబు, నగర కార్యదర్శి ఆర్.నరసింహులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

● సీపీఎం పాతబస్తీ నగర కమిటీ ఆధ్వర్యంలో సుర్జిత్ భవన్ కార్యాయలంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకుడు రామకృష్ణ, ఇక్బాల్ హుస్సేన్, కేవీ సుబ్బయ్య, అబ్దుల్ దేశాయ్ పాల్గొన్నారు.

గూడూరు: గూడూరులో సీఐటీయూ కార్యాలయంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభను నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రాంతీయ కమిటి సభ్యులు రవి, కోటయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ఓర్వకల్లులోని ప్రజా సంఘాల కార్యాలయంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి శ్రీధర్, సీపీఎం నాయకులు నాగన్న, సీఐటీయూ నాయకులు సుధాకర్, మద్దిలేటిలు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయ కులు కేశాలు, ఎల్లరాజు, దస్తగిరి, బుజ్జన్న పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరు సూర్యనారాయణ భవన్ లో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ తదితరులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఏ.కృష్ణ, కే.మధు, శీను, ఆంజనేయులు, రాజశేఖర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, ఎస్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్‌గౌడు, పీఎస్ఏ జిల్లా కార్యదర్శి రాజు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేంద్ర నాయుడు డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓర్వకల్లు ఎస్సీ హాస్టల్‌లో మూడు వారాల క్రితం ఫుడ్ పాయి జన్ అయి విద్యార్థులు అస్వస్థకు గురయ్యారని, ఇది వార్డెన్ల నిర్లక్ష్యం కారణంగానే జరిగిందన్నారు. వార్డెన్ సుంకన్నపై ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. హాస్టల్‌లో కొన్ని చోట్ల ఇప్పటికీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. అనం తరం ఆర్డీవో వెంకట నారాయణమ్మకు విద్యార్థి సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్ రాము, హేమంత్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

కర్నూలు క్రైం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ఫెస్టివల్ ఆఫర్స్, బిగ్ సేల్స్ అంటూ లింకులు పంపి సైబర్ నేరస్థులు మోసాలకు పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. తక్కువ ధర కదా అని ఆశపడి లింకులు ఓపెన్ చేస్తే సైబర్ మోసాల వలలో పడుతారని, అలాగే సెల్ ఫోన్లు గెలుచుకున్నారంటూ ఆఫర్ చేస్తారని అన్నారు. పత్తికొండకు చెందిన ఓ వ్యక్తికి వాట్సాప్‌లో దసరా బిగ్ సేల్ మీరు కారు గెలిచారు.. క్లైమ్ చేసుకోవడానికి క్లిక్ చేయండని నమ్మించగా లింక్ క్లిక్ చేసి బాధితుడు డిటైల్స్ ఇచ్చాడు. పది నిమిషాల్లోనే అతని బ్యాంకు ఖాతా నుంచి రూ.25వేలు డెబిట్ అయింది. ఇలా సోషల్ మీడియాలో వచ్చే లింకులను ఎట్టిపరి స్థితుల్లోనూ డౌన్‌లోడు చేసుకోవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే సైబర్ క్రైమ్ 1930 హెల్ప్ లైన్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి: ఆర్డీవో

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్ అన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ఆర్డీవో కార్యాలయంలో డివిజినల్ స్థాయిలో బాల్య వివాహాల నిషేధ చట్టం 2006పై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆర్డీవో మాట్లాడుతూ మండల, గ్రామ స్థాయిలో ఉన్నటువంటి బాల్య వివాహాల నిషేద పర్యవేక్షణ కమిటీలు బలోపేతం కావాలని అప్పుడు ఈ నిషేదం అమలలోని వస్తుందన్నారు. ఈ కమిటీలు నెలల్లో 15 రోజులకు ఒకసారి సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నారు. డివిజన్ స్థాయిలో బాల్య వివాహాల నియంత్రణ కోసం వాట్సాప్ ట్రెండ్ క్రియేట్ చేయాలన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.విజయ మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 54 బాల్య వివాహాలను నిలిపి వేశామన్నారు. జిల్లా బాల సంక్షేమ సమితి సభ్యులు సంజీవరెడ్డి, అబ్జర్వేషన్ సూపరింటెడెంట్ హుశేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కొళాయిలు ఏర్పాటు చేసుకోవాలి



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఏఈ

కల్లూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉలిందకొండ గ్రామస్థులు ప్రతి ఇంటికీ కొళాయిలు ఏర్పాటు చేసుకొని తాగునీటి వృధాను అరికట్టా లని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన పాణ్యం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఉలిందకొండ గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో, సంతమార్కెట్ ఏరియాల్లో పర్యటించారు. గ్రామంలో పైప్‌లైన్, వాటర్ ట్యాంకులను పరిశీలించారు. ఇళ్లకు కొళాయిలు ఏర్పాటు చేసుకోకపోవడం గుర్తించి ప్రజలకు అవగాహన కల్పించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు ఈవీ రమణ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం అవసరమని ఉపకులపతి వెంకట బసవరావు అన్నారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల సెమినార్ హాలులో హైజెనిక్ ఆర్గానిక్ శానిటరీ ప్యాడ్ల వినియోగం గురించి అవగాహన సదస్సు జరిగింది. ఉపకులపతి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యవంతంగా ఉన్నప్పుడే కుటుంబం సక్రమంగా ఉంటుందన్నారు. సదస్సులో రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, కో-ఆర్డినేటర్ నాగరాజు, ప్రిన్సిపాల్ సీవీ కృష్ణారెడ్డి, వెంకటరత్నం విద్యార్థులు పాల్గొన్నారు.

● ఉత్తమ అధ్యాపక అవార్డు అంత సులువు కాదని ఇన్‌చార్జి ఉపకులపతి వి. వెంకట బసవరావు అన్నారు. శుక్రవారం క్లస్టర్ యూనివర్సిటీలో సిల్వర్ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం ఆధ్యక్షుడు డాక్టర్ ఎల్లా కృష్ణ ఆధ్వర్యంలో ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్న డాక్టర్ బి. అనూషకు సన్మాన కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బ్రాహ్మణదొడ్డి మాజీ సర్పంచ్ మృతి



నాగభూషి(ఫైల్)

సి.బెళగల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామ మాజీ సర్పంచ్ నాగభూషి(85) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఈయన 1998 సంవత్సరం నుంచి 2004 వరకు సర్పంచ్ పనిచేశారు. ఈయనకు ఐదుగురు కుమారులు, ఐదుగురు కూతుర్లు, భార్య ఉన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని గడియారం ఆసుపత్రి సమీపంలోని ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం 10 గంటలకు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల ఆహ్వాన కమిటీ కన్వీనర్, కథా రచయిత ఎస్ఎండీ ఇనాయతుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. 1985లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొట్టమొదటి బ్యాచ్‌లో టీటీసీ శిక్షణ పూర్తిచేసిన పూర్వ విద్యార్థులంతా ఈ సమ్మేళనంలో పాల్గొంటారని ఆయన తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే

కల్లూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శుక్రవారం మాధవీనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాణ్యం నియోజకవర్గ పరిధిలోని ప్రజల సమస్యలపై గ్రీవెన్స్ నిర్వహించారు. పలువురు ఎమ్మెల్యేకు తమ సమస్యలను విన్నవించారు.

హామీలను నెరవేర్చాలి

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని బీసీ సంఘం నాయకులు శుక్రవారం కలెక్టరేట్ పరిపాలన అధికారి శివరాముడుకు వినతి పత్రం అంద జేశారు. బీసీ సంక్షేమ సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షుడు ధర్మేంద్ర మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు వల్లే బీసీలకు కూడా తమ జనాభా దామాషాలో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. నాగరాజు, ఆనంద్‌బాబు, నాగార్జునగౌడు, అంజి పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

గూడూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి, హౌసింగ్ పీడీ చిరంజీవి అన్నారు. శుక్రవారం పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మల్లాపురం గ్రామంలోని పాఠశాలలో ఎంఈవో సునీలమ్మతో కలిసి ప్రత్యేకాధికారి చిరంజీవి మధ్యాహ్న భోజనంతోపాటు రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని సిబ్బంది ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

సొసైటీ చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ

ఓర్వకల్లు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నన్నూరు సహకార సంఘం కార్యాలయంలో చైర్మన్‌గా బి.నాగేశ్వరరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీక రించారు. ఆయన మాట్లాడుతూ తనకు చైర్మన్ పదవి కేటాయించిన సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే గౌరు చరితకు రుణపడి ఉంటానన్నారు. సొసైటీ పరిధిలోని రైతుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు విశ్వేశ్వరరెడ్డి, విజయుడు, శేఖర్ రెడ్డి, సీఈవో సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

కిసాన్ కాంగ్రెస్ జిల్లా చైర్మన్‌గా సూర్యప్రకాష్‌రెడ్డి

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కిసాన్ కాంగ్రెస్ జిల్లా చైర్మన్‌గా ఎ.సూర్యప్రకాష్ నియమితులయ్యారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కిసాన్ కాంగ్రెస్ సమావేశంలో ఆయన రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కామన ప్రభాకర్ రావు చేతుల మీదుగా నియామపత్రం అందుకున్నారు. నా మీద నమ్మకంతో కిసాన్ కాంగ్రెస్ చైర్మన్‌గా నియమించినందుకు జాతీయ కాంగ్రెస్ యువ నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇష్టంతో చదవాలి

సి.బెళగల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టంతో చదివితే ఉన్నత శిఖలను అధిరోహిస్తారని నంద్యాల జిల్లా సెట్కూరు వెల్ఫేర్ ఆఫీసర్ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సి.బెళగల్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. ప్రిన్సిపాల్ చింతలయ్య, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖరరెడ్డి, అధ్యాపకుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ అవసరం: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలో పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని నగర పాలక సమావేశభవనంలో 'ఓపెన్ ఫోరం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికే ప్రతి శుక్రవారం ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎల్ఆర్ఎస్ పథ కంపై ప్లానింగ్ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ వెంకటరమణ, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్‌బాషా పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ ఎంపికలు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఎన్‌సీసీ ఎంపికలు నిర్వహించారు. విద్యార్థులకు పరుగు పందెంతోపాటు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించి అందులో 17 బాలురను, 6 బాలికలను ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అడ్మినిస్ట్రేటివ్ గిరిధర్ కుమార్, డీన్ శశికుమార్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మధుశేఖర్ పాల్గొన్నారు.

ప్రతి ఉపాధ్యాయుడు నిత్య శాస్త్రవేత్తగా మారాలి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రతి ఉపాధ్యాయుడు నిత్య శాస్త్రవేత్తగా మారి విద్యార్థులకు తరగతి గదుల్లోనే పాఠ్యాంశాలను బోధించాలని సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇన్‌స్పైర్ మనక్-2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి కర్నూలు, ఆదోని డివిజన్ల సైన్స్ ఉపాధ్యాయులకు స్థానిక బీ.క్యాంపులోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో శిక్షణ కార్యక్ర మం జరిగింది. శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులతో ఇన్నోవేషన్, సృజనాత్మకత ప్రాజెక్టులకు పునాదిలోనే మెలకువలు నేర్పితే వారు గొప్ప శాస్త్రవేత్తలుగా రాణిస్తారన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.విమల మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పాఠ్యాంశాలతో పాటు ప్రయోగ పద్ధతిలో వివరించాలన్నారు. ఎంఈవోలు ఆదాంబాషా, రామాంజనేయులు, అబ్దుల్ రెహిమాన్, శ్రీనివాసులు, వణిజా కుమారి, జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ, ఉస్మాన్, మరియానందం, రంగస్వామి పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి: ఎంపీ

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ మెరుగైన సేవలందించాలని కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు అన్నారు. శుక్రవారం ప్రకాష్‌నగర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాయలంలో నిర్వహించిన టెలికామ్ అడ్వైజరీ కమిటీ సమావేశానికి ఎంపీ హాజరయ్యారు. బీఎస్ఎన్ఎల్‌లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. జనరల్ మేనేజర్ జి.రమేష్, డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజేశ్వరరావు, ఏజీఎం పి.శ్రీనివాసరావు, టీఏసి సభ్యులు, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అర్జీలను పరిష్కరించండి: ఎమ్మెల్యే

కర్నూలు రూరల్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలు ఇచ్చిన అర్జీలను వెంటనే పరిష్కారం చూపాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. కర్నూలు మండలం పసుపుల గ్రామంలో ఎమ్మెల్యే తన స్వగృహంలో శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): నెలవారి విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు ఏడీఈ నాగప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్ని సెక్షన్ కార్యాలయాల్లో విద్యుత్ కోత ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

సీతారామ్‌నగర్‌లో కొత్త రోడ్డు నిర్మించాలి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సీతారాం నగర్‌లో కొత్తరోడ్డు నిర్మించాలని పట్టణపౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కాలనీ వాసులతో కలిసి రోడ్డును పరిశీ లించారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ కొత్తరోడ్డు వేస్తామని ఉన్న రోడ్డును తవ్వి వదిలేసారన్నారు. ప్రమాదాలు జరిగితే అధికారులే బాధ్యత వహించాలన్నారు. వర్షం వస్తే గుంతలు కనిపించవని, రాత్రి సమయాల్లో లైట్లు వెలగవని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీవాసులు ఏనుగుల పుల్లారెడ్డి, ఎస్.రవీంద్ర, చలమారెడ్డి, నాగరాజు, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

- సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో వర్షాలు కురుస్తుందున అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆదేశించారు. శుక్రవారం పట్టణంలో లోతట్టు ప్రాంతాలు, రాంజల చెరువును అధికారులతో కలిసి పరిశీలించారు. రెవెన్యూ, జలవనరుల , మున్సిపల్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రాణాపాయం, ఆస్తి నష్టం సంభవించుకుండా చూడాలని కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. లోతట్టు, నదీతీర ప్రాంతాల్లో దండోలా వేయించి, ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పునరావాస కేంద్రాలను సిద్ధం చేసి ఉంచుకోవాలన్నారు. వాగులు, వంకలు పొంగిపొర్లే పరిస్థితుల్లో వాహనాల రాకపోకలు నిలిపివేసి, సురక్షితమైన ప్రత్యామ్నాయ రహదారులపైకి మళ్లించాలని తెలిపారు. విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రమాదాలను నివారించాలని ఆదేశించారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

జోరువాన..

- ఆదోనిలో 86.8 మి.మీ., మద్దికెరలో 35 మి.మీ.లు
- ఉధృతంగా ప్రవహిస్తున్న గర్జివంక, వేదవతి నదులు, నిండి పొర్లిన రాంజల చెరువు
- ఆదోని మండలం బసాపురానికి నిలిచిన రాకపోకలు



ఆదోని రైల్వేస్టేషన్ రోడ్డులో వర్షపు నీరు



ట్రాక్టర్‌లో గర్జివంక దాటుతున్న ఉద్యోగులు



హలహర్వి : వేదవతి వద్ద వరద నీటిలో మొక్కజొన్న



మద్దికెర: సుద్దబాయి వంకను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఆదోని/ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేని వర్షం కురిసింది. ఎస్కేడీ కాలనీలోని 5వ రోడ్డులో సీఎస్ఐ చర్చి వద్ద ఉన్న పురాతన భారీ వృక్షం నేలకొరిగింది. లోతట్టు ప్రాంతాలు కోట్ల విజయభాస్కర్ రెడ్డి నగర్, రాజాసాబ్ బంగ్లా, క్రాంతినగర్, జల్‌గారి వీధి, బోయగిరి, విజయనగర్ కాలనీ, టెలీకాంనగర్‌లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. రైల్వేస్టేషన్ రోడ్డు, తిరుమలనగర్, మున్సిపల్ మెయిన్ రోడ్డు, కౌడల్‌పేట, ఎల్.బి.స్ట్రీట్, కల్లుబావి, శంకర్‌నగర్, క్రాంతినగర్ తదితర కాలనీల్లోనూ ఇదే పరిస్థితి.

ఆదోని రూరల్: తహసీల్దార్ కార్యాలయంలోకి నీరు చేరింది. బసాపురం గ్రామ సమీపంలోని గర్జివంకకు భారీగా వరద రావడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులను గ్రామస్థులు ట్రాక్టర్ సాయంతో వంకను దాటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమేష్ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 7981530771, 8074669919, 7981019455 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

హలహర్వి: మండలంలో శుక్రవారం జోరువాన కురిసింది. సిద్ధాపురం వాగుకు భారీగా నీరు చేరడంతో రాకపోకలు స్తంభించింది, జనజీవనం అస్తవ్యస్తమైంది. నీట మునిగిన పొలాలను తహసీల్దార్ లక్ష్మీనారాయణ పరిశీలించారు. వేదవతి సమీపంలోని మొక్కజొన్న పంట సగం వరకు నీటిలో మునిగిపోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.

మద్దికెర: మద్దికెర, బురుజుల, ఎం.అగ్రహారం గ్రామంలో శుక్రవారం కూడా వర్షం కురిసింది. బురుజుల సరిహద్దులోని సుద్దబాయి వంక పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కంది పంట నీట మునగడంతో రైతులు నష్టపోయారు. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ గుండాల్ నాయక్ సూచించారు. శుక్రవారం మండలంలోని బురుజుల వద్ద సుద్దబాయి వంకను పరిశీలించారు

వృద్ధులను కాపాడిన అధికారులు

ఆదోని టౌన్: పట్టణంలోని శంకర్ నగర్ కాలనీ ఇంట్లో ఇద్దరు వృద్ధులు చిక్కుకున్నట్లు సమాచారం రావడంతో మునిసిపల్ అధికారులు కమిషనర్ కృష్ణ ఆదేశాల మేరకు హెల్త్ ఆఫీసర్ డా. సందీప్ కుమార్ సిబ్బందితో వెళ్లి 80 సంవత్సరాల పైబడి, అస్వస్థతతో ఉన్న వృద్ధుడిని మంచంతో పాటు వరద నీటి నుంచి బయటికి తీసుకొని వచ్చారు.

దేవనకొండ: రెండు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు హంద్రీకి వరద పోటెత్తింది. నది నుంచి గాజులదిన్నె జలాశయానికి వరద చేరుతుండటంతో గేట్లు ఎత్తే ఆవకాశం ఉంది.

ఆస్పరి: మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. సుమారు 52.2 ఎం.ఎం. వర్షపాతం నమోదైంది. వాగులు, వంకలు పొర్లి పారాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అట్టేకల్ గ్రామంలో రహదారిపై నీరు చేరింది. పుప్పాలదొడ్డి, నగరూరు, తంగరడోణ, ముత్తుకూరు, వెంగళాయిదొడ్డి చెరువులు, వంకలు, వాగులు పొంగిపొర్లాయి. ఖరీఫ్‌లో పంటలు నీట మునిగాయి.



ఆదోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి కాలనీలో వర్షపు నీరు



ఆదోనిలో వృద్ధుడిని కాపాడుతున్న మున్సిపల్ సిబ్బంది



ఆదోని: ఆస్మియా ఉర్దూ పాఠశాలలో ఇలా..

పొర్లిపారిన రాంజల చెరువు

ఆదోని టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేని వర్షాలకు పట్టణానికి చెందిన రామ్‌జల చెరువు నిండి పారింది. చెరువు కట్టపై నుంచి వరద నీరు పొంగిపొర్లుతుండటంతో పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో వచ్చారు. 1,100 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన చెరువు పూర్తిగా నిండిపోవడంతో మున్సిపల్ కమిషనర్ కృష్ణ సిబ్బందితో కలిసి పరిశీలించారు. చెత్తను తొలగించాలని చెరువు భద్రతకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.



చెరువు నిండి పారుతున్న నీరు

ఉధృతంగా వేదవతి



పొంగిపొర్లుతున్న వేదవతి

హొళగుంద, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్లమాడికి గ్రామం వద్ద ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో వేదవతి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నీటి మట్టం గంట గంటకు నీటి మట్టం పెరుగుతోందని గ్రామస్థులు శుక్రవారం తెలిపారు. మార్లమాడికి మీదుగా కర్ణాటక కు రాకపోకలు అంతరాయం ఏర్పడింది.

చెరువులో చేపల వేట



జొన్నగిరిలో చెరువులో చేపలు పడుతున్న ప్రజలు

తుగ్గలి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి కురిసిన భారీ వర్షాలకు జొన్నగిరి చెరువు నిండి పారింఇ. దీంతో చేపలు బయటకు వస్తుండటంతో స్థానికులు శుక్రవారం చేపలు పట్టారు. అటువైపు వెళ్లే వారు చేపలను చూసి సంతోషించారు.

మా కాలనీకి రోడ్లు వేయించండి

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తమ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ నిర్మించాలని దిద్దిసేను కాలనీ వాసులు కోరుతున్నారు. పట్టణంలోని డిగ్రీ కళాశాల వెనకభాగంలో 14 ఏళ్ల క్రితం తాము గుడిసెలు వేసుకున్నామన్నారు. పలుమార్లు విన్నవించినా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం కురిస్తే బురదతో ఇబ్బంది పడుతన్నామని శుక్రవారం సీపీఐ నాయకుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో అధికారులకు విన్నవించారు.



వర్షాలకు దెబ్బతిన్న రోడ్డును చూపిస్తున్న కాలనీవాసులు

కేసు నమోదు చేయాలి

- పత్తికొండ డీఎస్పీకి నాయకుల వినతిపత్రం

ఆదోని, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మండలం మణేకుర్తి గ్రామంలో కనకదాసు విగ్రహం ధ్వంసం చేసిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జునలు డిమాండ్ చేశారు. శుక్రవారం పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్యకు వినతి పత్రం అందించారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. జడ్పీ మాజీ ఛైర్మన్ బత్తిన వెంకటరాముడు, డైరెక్టర్ శీను, న్యాయవాది తాయన్న, మాజీ సర్పంచ్ దేవేంద్రప్ప, రమేష్, గొర్రెల సంఘం డైరెక్టర్ అనిమిరెడ్డి పాల్గొన్నారు.

ఆలూరు: గ్రామంలో గొడవలు సృష్టించేందుకే విగ్రహాన్ని ధ్వంసం చేశారని కురువ సంఘం నాయకులు బెల్లం రఘుబాబు అన్నారు. శుక్రవారం మణేకుర్తి గ్రామంలో దుండడగులు దాడిలో కనకదాసు విగ్రహాన్ని ఎస్ఐ మహబూబ్‌బాషాతో కలిసి పరిశీలించారు.



వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేషన్ అధ్యక్షుడు దేవేంద్రప్ప

నీటిని తొలగించాలి

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో రైతులు పొలాల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ఏవో సుధాకర్ సూచించారు. శుక్రవారం మాట్లాడుతూ రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పొలాలు మునిగిపోతున్నాయన్నారు. రైతులు వర్షపు నీటిని కాలువల ద్వారా బయటికి పంపాలన్నారు. పోషకాల కోసం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. పంట త్వరగా కోలుకోవడానికి నానో డీఏపీ ఎకరాకు 500మి.లీ పిచికారీ చేయాలని సూచించారు. దోమపోటు నివారణకు జిగురు అట్టాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

వెండి కవచం మాయం

ఆదోని రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కపటి గ్రామ నడిబొడ్డన ఉన్న మూడుముఖాలమ్మ ఆలయంలో దేవతామూర్తికి ఉన్న వెండి 50తులాలు కలిగిన వెండి ముఖ కవచాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. చోరీని గుర్తించిన గ్రామస్థులు శుక్రవారం ఆలయానికి చేరుకొని పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పరిశీలించి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ సీఐ నల్లప్ప సిబ్బందితో చేరుకుని ఆలయాన్ని పరిశీలించి, పూజారి ఎల్లమ్మను విచారించారు. ఆలయానికి వేసిన తాళం వేసినట్లే ఉందని, కానీ వెండి కవచం మాయమైందని త్వరలో దొంగలను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

పంచాయతీ భవన నిర్మాణానికి రూ.32 లక్షలు

మద్దికెర సెప్టెంబరు 12 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని బొమ్మనపల్లి గ్రామం పంచాయతీ భవన నిర్మాణానికి రూ.32 లక్షల ఉపాధి నిధులు మంజూరైనట్లు పంచాయతీ రాజ్ ఏఈ విష్ణువర్దన్, సర్పంచ్ ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ పంచాయతీ కొత్తగా ఏర్పడిందని నాలుగేళ్లుగా పాఠశాల గదిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు.

నేడు, రేపు ఉల్లి తీసుకెళ్లొద్దు

దేవనకొండ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డుకు శని, ఆదివారాలు సెలవ ప్రకటించారని ఉల్లి దిగుబడులను తీసుకెళ్లవద్దని ఏవో ఉషారాణి రైతులకు సూచించారు. సోమవారం నుంచి కొనుగోళ్లు ఉంటాయని రైతులు కుళ్లు, తేమలేని లేకుండా గ్రేడింగ్ చేసిన ఉల్లిని తీసుకెళ్లాలని కోరారు.

వేతనాలు పెంచాలి

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మేజర్ గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ మండల కార్యదర్శి రవిచంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ చెన్నయ్యకు వినతి పత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు వేతనాలు పెంచి సక్రమంగా అందించాలన్నారు. ఈనెల 25వ తేదీన విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలన్నారు. పంచాయతీ కార్మికులు సతీష్, నరసన్న, ధనలక్ష్మి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

'ముఖ్యమంత్రికి రుణపడి ఉంటా'

ఆదోని రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తనకు హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశమిచ్చిన సీఎం చంద్ర బాబుకు రుణపడి ఉంటానని ఆరేకల్లు రామకృష్ణా తెలిపారు. డైరెక్టర్‌గా నిమితుడైన ఆయనను కూటమి, వాల్మీకి సంఘం నాయకుల శుక్రవారం సన్మానించారు. తన సేవలను గుర్తించి మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడి కృషితో సీఎం తనను ఎంపికచేశారన్నారు.



రామకృష్ణను సన్మానిస్తున్న ఎల్ఐసీ ఉద్యోగులు



పతకాలను బహూకరిస్తున్నవిశ్రాంత న్యాయాధికారి

శ్రద్ధ చూపితే రాణిస్తారు

ఆదోని టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపితే రాణిస్తారని విశ్రాంత న్యాయాధికారి విరుపాక్షి అన్నారు. శుక్రవారం సాయంత్రం వివిధ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు లక్ష్మమ్మ టౌన్ బ్యాంకులో 23వ బంగారు పథకాలను అందజేశారు. ప్రభుత్వ ఖాజీ అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ బంగారు పతకాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. బ్యాంక్ బీవోఎం ఛైర్మన్ రాచోటి సుబ్బయ్య, ఛైర్మన్ రాచోటి రామయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

55మందికి ఉద్యోగాలు

ఆలూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి, శిక్షణశాఖ సంయుక్తంగా నిర్వహిం చిన జాబ్‌మేళాలో 55మంది నిరుద్యోగులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. శుక్రవారం జాబ్‌మేళాలో 10 కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎల్.ఆనంద్‌రాజ్‌కుమార్, కో ఆర్డినేటర్ వీరేష్, ప్రిన్సిపాళ్లు డా.జ్ఞానేశ్వర్, రమాదేవి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

హొళగుంద, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పజా సమస్యలను పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హొళగుంద ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. అర్జీలను త్వరిగతిన పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్లు ప్రతి అర్జీను పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. 50 అర్జీలు స్వీకరించారు. డీఎల్‌పీవో తిమ్మక్క, ఆర్అండ్‌బీ ఈఈ పద్మనాభ రెడ్డి, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ షఫీ ఉల్లా, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, డిప్యూటీ ఈవో వెంకటరమణ రెడ్డి, తహసీల్దార్ నిజాముద్దీన్, ఎంపీడీవో విజయ లలిత పాల్గొన్నారు.



దివ్యాంగుడి అర్జీ స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

డీఏలు విడుదల చేయాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్



వినతి పత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, ఉద్యోగులకు 30శాతం మధ్యాంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాటూరు రవికుమార్, రాఘవరెడ్డి, శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మిగనూరులోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం రీ సర్వే డీటీ జ్యోతీర్మయికి వినతిపత్రం అందజేశారు.

మంత్రాలయ: ఉపాధ్యాయులకు బోధన సమయాన్ని హరించే బుక్‌లెట్, అసెస్మెంట్ విధానాలను రద్దు చేయాలని పెండింగ్‌లో ఉన్న 4డీఎలను వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాటూర్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల అధ్యక్షుడు నాగరాజ అధ్యక్షతన నిరసనలు చేపట్టారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్‌బాబు, కార్యదర్శులు రంగనాథ్, మహబూబ్ బాషా, శ్రీనివాసులు, రాజేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పెద్దకడబూరు : పెండింగ్‌లో ఉన్న 4డీఎలను వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు వీరేష్, సురేష్‌లే డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దకడబూరులోని తహశీల్దార్ కార్యలయంలో ఆర్ఐ జర్మియాకు వినతి పత్రం అందజేశారు.

ఎమ్మిగనూరు టౌన్ : విద్యారంగ, ఆర్థిక సమస్యల పరిష్కారానికి జరిగే పోరాట ప్రచార యాత్రను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటి సభ్యులు రామాంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం విద్యారంగ సమస్యలపై, ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని ఈ నెల 15 నుంచి 19 వ రకు యుటిఎఫ్ అధ్వర్యంలో రణభేరి ప్రచారబైక్ యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మోహన్, రాఘవేంద్ర, రవి ప్రకాష్ పాల్గొన్నారు.

వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలి

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): అసంక్రమిత వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి, డాక్టర్ మహేశ్వర ప్రసాద్ కోరారు. శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య ఆసుపత్రిలో అసంక్రమిత వ్యాధులు, ఎన్‌సీడీ 4 క్యాన్సర్ వ్యాధులపై వైద్య సిబ్బందికి శిక్షణా కార్యాక్రమం నిర్వహించారు. డాక్టర్ సుజీత, డాక్టర్ ఆదినగేష్, డాక్టర్ సౌజన్య లతా, డెంటల్ డాక్టర్ సంధ్యకుమారి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంత్రాలయం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 132/32కేవీ 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్లు మరమ్మతులు చేస్తుండటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో డీఈ విశ్వశాంతి స్వరూప్, ట్రాన్స్‌కో ఏఈ గోవిందు అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రెండో శనివారం సందర్భంగా ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, విద్యుత్ లైన్లు సరిచేయడం వల్ల మంత్రాలయం మండలంతో పాటు చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మంత్రాలయంతో పాటు గ్రామీణ ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయాన్ని గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలన్నారు.

కొడుకులు పట్టించుకోవడం లేదు

● డీఎస్పీకి వృద్ధ దంపతుల ఫిర్యాదు

నందవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆరుగురు కొడుకులు.. ఇద్దరు కూతుళ్లు ఉన్నా తమని ఎవరూ పట్టించుకోవటం లేదని కనకవీడు గ్రామానికి చెందిన కమ్మరి ఉరుకుందప్ప, కమ్మరి ఉరుకుందమ్మ ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవికి ఫిర్యాదు చేశారు. నందవరం మండలం కనకవీడు గ్రామానికి చెందిన కమ్మరి ఉరుకుందప్ప, కమ్మరి ఉరుకుందమ్మలకు ఆరుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరికి కనకవీడు, సిందనూరు గ్రామాల్లో 45 ఎకరాలు భూమి, 60 సెంట్ల ఖాళీస్థలం ఉంది. ఈ ఆస్తిని గతంలో ఆరుగురు కుమారులకు ఒక్కొక్కరికి 7ఎకరాలు, 10 సెంట్ల స్థలం పంచి ఇచ్చామని తెలిపారు. తాము కుమారులపై ఆధారపడకుండా ఇప్పటి వరకు జీవనం కొనసాగించామన్నారు. అయితే వయస్సు మీద పడడం, మూడేళ్లనుంచి ఆరోగ్యం క్షీణించడంతో జీవనం కష్టంగా మారిందని చెప్పారు. ఈ క్రమంలో తమ బాగోగులు చూడాలని కుమారులను కోరినప్పటికీ ఏమాత్రం పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకరి దగ్గరకు వెళ్తే మరొకరి దగ్గరకు వెళ్లాలంటున్నారు. గ్రామపెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టినా పట్టించుకోవటం లేదు. నందవరం పోలీసులకు ఫిర్యాదు చేయటంతో ఎస్ఐ పిలిపించి మందలించినా కుమారులు ఏమాత్రం పట్టించుకోవటం లేదని, గమనించి న్యాయం చేయాలని డీఎస్పీని కోరారు. వారి కుమారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని నందవరం ఎస్ఐని డీఎస్పీ ఆదేశించారు.

తప్పుడు ప్రచారాలకు కేరాఫ్ వైసీపీ

ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): 'తప్పుడు ప్రచారాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ పార్టీయో'నని.. ప్రభుత్వం చేస్తున్న ప్రతి మంచికి తప్పుడు ప్రచారం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి విమర్శించారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో జనసేన ఇన్‌చార్జి రేఖాగౌడ్, బీజేపీ నాయకులు నరసింహులుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం 90శాతం అమలు చేసిందన్నారు. దీంతోనే సూపర్ సిక్స్. సూపర్ హిట్ అనంతపురం సభ సూజర్ హిట్ అయ్యిందన్నారు. మాజీ సీఎం జగన్ మెడికల్ కాలేజీలు పూర్తి చేశామని చెప్పటం దారుణమన్నారు. 'కర్నూలు జిల్లాలోని ఆదోనిలో మెడికల్ కాలేజీ పూర్తి అయ్యిందా?' అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమం కార్యక్రమాలను వైసీపీ పార్టీ అడ్డుతగులుతూ ఫేక్ ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. వైసీపీ ఎమ్మిగనూరు ఇన్‌చార్జీ బుట్టా రేణుక ఆసుపత్రి గురించి వాస్తవాలను తెలుసుకొని మాట్లాడాలన్నారు. 'మీ ఇమేజ్ కోసం ఎమ్మిగనూరు ఇమేజ్‌ను తగ్గించొద్దన్నారు. ఆసుపత్రిలో వైద్యులు సరిగాలేరని, పరికరాలు సక్రమంగా లేవనటం విడ్డూరంగా ఉందన్నారు. నాబార్డు నిధుల కింద టీడీపీ హయంలో 100 పడకలను మంజూరు చేయించామన్నారు. వైసీపీ ఐదేళ్లలో ఆసుపత్రిని ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఆసుపత్రి కొత్త భవనాలలోకి మార్చేందుకు కొంత సమయం పడుతుందన్నారు. ఈ విషయం కూడా తెలియకుండా మాట్లాడటం వైసీపీ నాయకులకే చెల్లిందన్నారు. వైసీపీ నిర్వాకం వల్లే ఆసుపత్రిలో నేడు పరికరాలు సరిగా లేకుండా పోయాయని ఆరోపించారు. తాను ఎమ్మెల్యే అయిన తరువాతే ఓపి గది ఏర్పాటు చేశామన్నారు. నేషనల్ హైవే ఉంటేనే క్రిటికల్ కేర్ యూనిట్ వస్తుందని, దీంతోనే ముందుగా నేషనల్ హైవేకోసం ప్రతిపాదనలు పంపామన్నారు. కాన్పులలో ఎమ్మిగనూరు ప్రభుత్వాసుత్రి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. ఈ విషయాలు తెలుసుకోకుండా ఎవరో చెప్పిన మాటలు విని మాట్లాడటం బుట్టా రేణుకకు సరికాదన్నారు. సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ మల్లయ్య, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మాచాని మహేష్, కాశీం వలి, వెంకటేష్, ముల్లా కలీముల్లా, బుగిడే నాగరాజు, కటారి రాజేంద్ర, నరసింహులు, నజీర్, రామకృష్ణ నాయుడు, తిమ్మారెడ్డి, కరణం రవి, యల్లప్ప, జట్టప్ప, నరసన్న గౌడ్, శంకరమ్మ, విజయలక్ష్మి, స్టేట్ బీసీ ఫైనాన్స్ కార్పోరేషన్ డైరెక్టర్ చిన్నరాముడులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వర్షం

● ఎడతెరిపిలేని వర్షాలతో ప్రజల ఇబ్బందులు
● పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
● అప్రమత్తంగా ఉన్నామన్న అధికారులు



ఉధృతంగా ప్రవహిస్తున్న రౌడూరు వంక



కోసిగి :వర్షం నీటితో చెరువుకుంటల్లా.. ఆర్టీసీ బస్టాండు

కౌతాళం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో మండలంలో రెండు రోజులుగా మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మండల కేంద్రమైన కౌతాళానికి, మండల పరిధిలోని పలుగ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నదితీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి తెలిపారు.

కోసిగి: శుక్రవారం మధ్యాహ్నం కోసిగిలో వర్షం దంచి కొట్టడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. కోసిగిలోని ఆర్టీసీ బస్టాండు వర్షం దాటికి చెరువు కుంటను తలపించింది. బస్టాండు వచ్చే ప్రయాణీకులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే రైల్వేగేటు సమీపంలోని ఉరుకుందరోడ్డులో ఉన్న చాప వంక పొంగి పొర్లడంతో సుమారు గంట పాటు రాకపోకలు నిలిచిపోయాయి. ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతుండటంతో రైతులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎమ్మిగనూరు రూరల్: మండలంలో 8.2 వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ హేమంత్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండలంలోని కడివెళ్ల, కందనాతి, మసీదుపురం, సిరిలదొడ్డి, కడిమెట్ల, కె.తిమ్మాపురం, ఎర్రకోట, కలుగొట్ల తదితర గ్రామాల్లో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకు ఎడతెరపిలేకుండా వర్షం పడిందన్నారు.

నందవరం: మండలంలోని చెరువులు, జీఆర్‌పీ, వంకలు, వాగులు దగ్గర అధిక వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు శ్రీనివాసులు కోరారు. అత్యవసర పరిస్థితుల్లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఫోన్ నెం:9542806819ను సంప్రదించాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు



పంచాయతీ కార్యదర్శులపై
ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జడ్పీ సీఈవో

గోనెగండ్ల, సెప్టెంబరు 12(ఆంధ్ర జ్యోతి): మండలంలోని 11 మంది పంచాయతీ కార్యదర్శులపై జడ్పీ సీఈవో నాసరరెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం గోనెగండ్ల మండలంలోని గంజహళ్లి, గోనెగండ్ల గ్రామాల్లో ఆయన పర్యటించారు. గంజహళ్లి గ్రామంలో పారిశుధ్యపనులు, సరిగా లేకపోవడం గ్రామ శివార్లలో చెత్తచెదారం చేరి ఉండటం, మురుగునీరు ఎక్కడి పడితే అక్కడ నిలిచి ఉండటం ప్రభుత్వం చేపడుతున్న ఇతర కార్యక్రమాలు కూడా సక్రమంగా నిర్వహించక పోవడంతో గంజహళ్లి గ్రామ అధికారుల పై ఆయన తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని మిగతా గ్రామాలలోని పారిశుధ్యపనులు, చెత్తనుంచి సంపద తయారు చేయడం వంటి పనులు సక్రమంగా నిర్వహించడం లేదని తేలిపోవడంతో మండలంలోని 11 గ్రామ పంచాయతీ కార్యదర్శులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేయడమే గాక లేక వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవో మణిమంజరిని సీఈవో ఆదేశించారు. దీంతో ఎంపీడీవో మణిమంజరి 11 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులను షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నాలుగు రోజుల లోపు తగిన సంజాయిషీ ఇవ్వాలని సంజాయిషీ సంతృప్తి కరంగా లేక పోతే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు. ఈవోఆర్‌డీ అనంతశయన కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రదీప్ రెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న అభిమానులు, నాయకులు,
జడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు

మంత్రాలయం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం మంత్రాలయంలో వైసీపీ మండల కన్వీనర్ గురెడ్డి భీమిరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, జనార్దన్‌రెడ్డి, కురువ మల్లికార్జున సమక్షంలో కేక్ కట్‌చేసి బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం అనాథలకు బెడ్లు, పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గంలో ఏ ఆపద వచ్చినా ప్రదీప్‌రెడ్డి ఆదుకుని న్యాయం చేస్తారని తెలిపారు. మంత్రాలయం అభివృద్ధి రాంపురంరెడ్డి సోదరులతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గోవిందమ్మ, ఎంపీటీసీ మజ్జిగ నరసమ్మ, వెంకటేష్ శెట్టి, గొరుకల్లు కృష్ణ, వైస్ ఎంపీపీ రామేవేంద్ర, వైస్ సర్పంచ్ హోటల్ పరమేశ్, సర్పంచులు బెస్త అంజిని, వీరారెడ్డి, ముకురన్న, రోగెప్ప, మజ్జిగ బొజ్జప్ప పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

మంత్రాలయం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల కనీస వేతనం రూ.26వేలు ఇచ్చేవరకు పోరాటం చేస్తామని సీఐటీయూ మండల నాయకులు జయరాజు తెలిపారు. శుక్రవారం మంత్రాలయం ఎంపీడీవో కార్యాలయం, పంచాయతీ గ్రామ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, కార్మికులను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు ప్రకాశం, ప్రసంగి, రాజు, హెచ్‌కేలు, కృప, భీమేశ్వరి, ఇజ్రాయేల్ పాల్గొన్నారు.

15న కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు

కోసిగి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అండర్-19 కబడ్డీ ఎంపిక పోటీలు కోసిగిలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 15న నిర్వహిస్తున్నట్లు కర్నూలు జిల్లా కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వలకలదిన్నె వెంకటేష్ తెలియజేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచి శ్రీకాంత్ ఆదేశాల మేరకు 26 అంతర్ జిల్లాల జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీలు ఎన్టిఆర్ జిల్లా గొల్లపూడిలో సెప్టెంబరు 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరగబోయే 51వ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లోభాగంగా కర్నూలు జిల్లా బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలుఈ నెల 15న సోమవారం కోసిగి ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడా ప్రాంగణంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చావిడి వెంకటేశ్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 1.1.2006 తర్వాత జన్మించిన వారై ఉండాలని, బాలుర 75 కేజీలు, బాలికలు 65 కేజీల్లోపు బరువు కలిగి ఉండాలన్నారు. జనన ధృవీకరణపత్రం, పదో తరగతి మార్క్‌మెమో, ఆధార్ కార్డు తీసుకుని సోమవారం ఉదయం 9 గంటలకు కోసిగి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కబడ్డీ క్రీడాకారులు బాలురు, బాలికలు పాల్గొనాలనీ, జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు తమ క్రీడాకారులను తీసుకురావాలన్నారు. సెలక్షన్స్‌కు మ్యాట్ షూస్, కబడ్డీ డ్రస్ కచ్చితం అన్నారు. వివరాల కోసం 9177320094 నెంబర్లను సంప్రదించాలన్నారు.

నిధులు మంజూరు చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అంబేద్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని దళిత జహజన జేఏసీ నాయకులు ఎమ్మెల్యే బి వి జయనాగేశ్వర రెడ్డిని కోరారు. ఎమ్మెల్యే బీవీ జయనాగే శ్వరరెడ్డి మాట్లాడుతూ ఎస్సీల సామాజిక, ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. అసెంబ్లీ సెషన్స్ తర్వాత వెంటనే ప్రణాళిక బద్ధంగా భవన నిర్మాణం కార్య క్రమం చేపడుదామన్నారు. కార్యక్రమంలో ప్రసన్న కుమార్, బతుకమ్మ, నరసప్ప పాల్గొన్నారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీమఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథం పై విహారించారు. బుధవారం బాద్రపద పంచమి శుభదినం ను పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాలు, విద్యుత్ దీపాల మధ్య స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలను అధిష్టించి ఊరేగించారు.

మంచాలమ్మకు విశేష పంచామృతాభిషేకం : మంత్రాలయంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. శుక్రవారం విశేష బాద్రపదమాసం పంచమి శుభ సందర్భాన్ని పురష్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో పండితులు, అర్చకులు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షీరాభిషేకం, కుంకుమ సేవ, విశేష పంచామృతాభిషేకం చేసి పట్టుచీర, బంగారు,వెండి ఆభరణాలుతో పాటు వివిధ రకాల పుష్పాలు, ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

'కఠినంగా శిక్షించాలి'

కౌతాళం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యో):కర్నూలు జిల్లా ఆలూరు మండలంలోని మణేకుర్తి గ్రామంలో కురువ కులస్థుల ఆరాధ్య దైవం భక్త కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కౌతాళం మండలం కురువ సంఘం అధ్యక్షుడు వీరేష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కురువల కులదైవం భక్త కనకదాసు విగ్రహాన్ని మణేకుర్తి గ్రామంలో గుర్తు తెలియని దుండగులు కనకదాసు విగ్రహం చేయిని ధ్వంసం చేయడం దారుణమని ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని పోలీసులు గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని లేని సమక్షంలో కురువ కులస్థులతో కలిసి గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. శివకుమార్, బీరప్ప, వీరలింగ, అనుమేష్, రమేష్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పెద్దకడబూరు, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కారించాలని డీవైఎఫ్ఐ నాయకులు మీషేక్, రాజు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని ఎంపీడీవో కార్యాలయంలోని ఏవో కౌసల్యకు డీవైఎఫ్ఐ నాయకులు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి సేవలు మరువలేనివి



ఏచూరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్ సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి పార్టీ నాయకులు ఘన నివాళి అర్పించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచి సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా వ్యక్తి, భారత రాజ్యాంగ మౌలిక విలువలైన ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఫెడరలిజం, సామాజిక న్యాయం, సమానత్వం, బీజేపీ కేంద్ర సర్కార్‌పై తీవ్రమైన దాడి చేస్తున్న తరుణంలో వాటిని ఎదిరించి పోరాటం చేశారన్నారు. రాముడు, నరసయ్య, రమేష్, కృష్ణ పాల్గొన్నారు.

పెద్దకడబూరు , సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సేవలు మరువలేనివని సీపీఎం నాయకులు తిక్కన్న, శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పెద్దకడబూరులోని సీపీఎం నేత సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్బంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సెప్టెంబరు 13వ తేదిన ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో జరిగే వర్తమాన రాజకీయాలు- సీపీఎం వైఖరి అనే అంశంపై జరిగే సభను వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు నాయకులు దేవదాసు, నాగరాజు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

నందవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఏఎస్ఐ నటరాజు కోరారు. శుక్రవారం నందవరం జెడ్పీ హైస్కూల్‌లో బాల్య వివాహల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎస్ఐ మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన తర్వాతనే బాలికలకు వివాహం చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ కోదండరామిరెడ్డి, నాగరాజు, బాస్కర్, ఉపాధ్యాయులు బసవరాజు, ముగతి ఈరన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీవీతోనే గ్రామాల అభివృద్ధి

నందవరం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డితోనే గ్రామాల అభివృద్ధి చెందాయని టీడీపీ నాయకులు రైస్‌మిల్ అసోషియేషన్ తాలుకా అధ్యక్షుడు నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాలతో హలహర్వి గ్రామంలో దూదేకుల వీధిలో రూ 10లక్షలతో సీసీ రోడ్డు, ప్రభుత్వ ఆసుపత్రి నుంచి బస్టాప్ వరకు రూ 20 లక్షలతో డైనేజీల కోసం ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీసీ సభ్యులు ఎర్రమనాయుడు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఎర్రన్న, ప్రభుదాసు, ఆనంద్ పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ కార్డులు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కౌతాళం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌలు రైతులందరికీ వెంటనే కౌలు కార్డులు అందజేసి వారికి బ్యాంకు రుణాలు అందేలా చూడాలని రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్ కోరారు. మండల కేంద్రమైన కౌతాళంలో శుక్రవారం రైతు సంఘం నాయకులతో కలిసి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య కౌలు రైతు సంఘం మండల నాయకులు శంకర్, బడేసాబ్, వీరేష్, ఈరన్న ఉన్నారు.

మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌ను కలిసిన నాయకులు

కోసిగి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవిని కోసిగి మండల ఎస్సీ సెల్ దళిత నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వంలోనే దళితులకు సముచిత న్యాయం జరుగుతుందని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి తెలిపారనీ టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు సోల్మాన్ రాజు చెప్పారు. ఎంపీటీసీ రాజు, దేవన్న తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి దళితులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందించేలా కృషి చేయాలని కోరామన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గోనెగండ్ల, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి):గోనెగండ్ల మండలంలోని హంద్రీ పరివాహక గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజేశ్వరి కోరారు. శుక్రవారం రాజేశ్వరి మాట్లాడుతూ గాజులదిన్నె ప్రాజెక్టు లో నీటి మట్టం 376.64 మీటర్లు ఉంది కావున జీడీపీ అధికారులు హంద్రీనదికి నీటి విడుదల చేస్తున్నాము కావున పరివాహక గ్రామాలైన గాజులదిన్నె, ఐరన్‌బండ, నేరుడుప్పల, పిల్లిగుండ్ల, లింగందిన్నె, గంజహళ్లి, హెచ్‌కైరవాడి, పుట్టపాశం, వేముగోడు, తిప్పనూరు, ఒంటెడుదిన్నె, ఎర్రబాడు గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు, మహిళలు, పిల్లలు నీటి పరివాహక ప్రాంతాలకు వెళ్లకూడదన్నారు.